





# కరీంనగర్ వార్త



**కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల**

**శనివారం 30, మే 2026** | **16 పేజీలు**


### నిరంతరాయంగా
## 'గ్రానైట్" అక్రమ రవాణా



2లో

- బిల్లులు లేకుండానే తరలింపు..!
- గ్రానైట్‌పై "జీఎస్టీ" నిఘా ఎక్కడ..?
- మైనింగ్ అధికారుల పాత్రపై అనుమానాలు..!
- పోలీసులు పట్టుకుంటేనే.. మైనింగ్ నిద్ర లేచేనా....?
- 3నెలల్లో.. 50 లక్షల జరిమానాలు


















## నిరంతరాయంగా

# 'గ్రానైట్" అక్రమ రవాణా

### కొలతల దగ్గరే అసలు కథ....
### బిల్లులు లేకుండానే తరలింపు..!
### గ్రానైట్‌పై "జీఎస్టీ" నిఘా ఎక్కడ..?
### మైనింగ్ అధికారుల పాత్రపై అనుమానాలు...!
### పోలీసులు పట్టుకుంటేనే.. మైనింగ్ నిద్ర లేచేనా....?
### 3నెలల్లో.. 50 లక్షల జరిమానాలు

**కరీంనగర్ బ్యూరో, ప్రభాత వార్త:** రాత్రికి రాత్రే కోట్లు సంపాదించాలనే అత్యాశ, చట్టాల పట్ల భయం లేకపోవడం, వెరసి కొందరు కేటుగాళ్లు ప్రకృతి సంపదను నిలువునా దోచేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రభుత్వ అనుమతులు లేవు, నిబంధనల అసలే పాటించరు. కొండలను పిండి చేస్తూ, భూగర్భాన్ని గుల్ల చేస్తూ పగలు రాత్రి తేడా లేకుండా సాగుతున్న ఈ నల్లదందా వెనుక పెద్ద తిమింగలాలే ఉన్నాయనే విమర్శలు లేకపోలేదు. కరీంనగర్ జిల్లా కేంద్రం సరిహద్దుల నుండి గ్రానైట్ అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎలాంటి పర్మిట్లు, మైనింగ్ అనుమతులు లేకుండానే రోడ్లపైకి వందలాది గ్రానైట్ లారీలు వస్తున్నా.. నివారించాల్సిన మైనింగ్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఖజానాకు భారీగా జీఎస్టీ, రాయల్టీ గండి కొడుతూ కొంతమంది అక్రమార్కులు సాగిస్తున్న ఈ దందాపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

### పోలీసులు పట్టుకుంటేనే.. మైనింగ్ నిద్ర లేచేనా..?

సాధారణంగా రవాణా అవుతున్న గ్రానైట్ లోడ్లపై నిఘా ఉంచాల్సిన మైనింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయడం లేదనే వాదనలు బలంగా ఉన్నాయి. ఇటీవల కాలంలో స్థానిక పోలీసులు అనుమానాస్పదంగా ఉన్న గ్రానైట్ లారీలను పట్టుకుని నిలదీసిన తర్వాతే.. మైనింగ్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని కొలతలు చూస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు పట్టుకున్న వాహనాలకు సైతం తూతూమంత్రంగా జరిమానాలు విధించి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, శాశ్వత నివారణకు చర్యలు చేపట్టడం లేదని సమాచారం. ఈ వ్యవహారంలో మైనింగ్ శాఖలోని కొందరు కింది స్థాయి అధికారుల కుమ్మక్కు ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### "ఈడీ" సోదాలు జరిగినా మారని తీరు..!

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గ్రానైట్ క్వారీలు, ఏజెన్సీలపై గతంలో కేంద్ర,రాష్ట్ర దర్యాప్తు సంస్థ సైతం సోదాలు నిర్వహించి, కోట్ల రూపాయల ఫెమా ఉల్లంఘనలు, ఫనామా లింకులు, పన్నుల ఎగవేతను గుర్తించిన సంగతి తెలిసిందే. అప్పట్లో ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయినప్పటికీ, కొందరు అక్రమార్కులు ఏమాత్రం వెనకడుగు వేయకుండా, స్థానిక అధికారుల అండదండలతో మళ్లీ పాత పద్ధతిలోనే ప్రభుత్వానికి పన్నులు, జీఎస్టీ చెల్లించకుండా బిల్లులు లేని రవాణాను కొనసాగిస్తున్నట్లు సమాచారం.

### కొలతల దగ్గరే అసలు కథ....

గ్రానైట్ అక్రమ వ్యాపారంలో అసలు మోసం మెజర్మెంట్స్ (కొలతల) దగ్గరే జరుగుతున్నట్లు తెలుస్తోంది.పన్నులు ఎగవేసేందుకు నకిలీ బిల్లులను సృష్టిస్తూ, అసలు కొలతల కంటే రికార్డుల్లో తక్కువగా చూపిస్తూ భారీ దోపిడీకి తెరలేపారనే ఆరోపణలు లేకపోలేదు. ప్రాథమిక అంచనాల ప్రకారం.. కేవలం ఒకే ఒక్క గ్రానైట్ లారీ రవాణాలో సుమారు 20 వేల రూపాయల మేర ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నట్లు తెలుస్తోంది. మరి రోజువారీగా వందల సంఖ్యలో నడుస్తున్న లారీల ద్వారా నెలకు ఎన్ని కోట్ల రూపాయల ప్రజాధనం పక్కదారి పడుతుందో ఊహించుకోవచ్చు.



ట్రైనీ ఐపీఎస్ సునీల్ దాడులతో గుట్టురట్టు...

గత మూడు నెలల కాలంలోనే గ్రానైట్ అక్రమ వ్యాపారులు, అధికారులకు సుమారు రూ. 50 లక్షలకు పైగా ఫైన్ల రూపంలో చెల్లించడం స్థానికంగా సంచలనం సృష్టించింది. ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్ ఆధ్వర్యంలో జరిగిన మెరుపు దాడుల్లోనే ఈ అక్రమాలన్నీ ఒక్కొక్కటిగా వెలుగుచూశాయి. కేవలం మూడు నెలల జరిమానాలు ఈ స్థాయిలో ఉంటే,గత కొన్ని సంవత్సరాలుగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ మాఫియా ఏ స్థాయిలో ప్రభుత్వ సొమ్మును దోచుకుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు .ఈ అక్రమ సంపాదనకు తెరలేపి కోట్లకు వ్యాపారులు పడగలేతినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. దొరికిన తర్వాత జరిమానాలు అయిన కడతాము కానీ, ప్రభుత్వానికి మాత్రం సక్రమంగా పనులు చెల్లించాము అనే ధోరణిలో వ్యాపారులు వ్యవహరిస్తున్న తీరు జిల్లాలో విమర్శలకు తావిస్తుంది..

### కొత్తపల్లి పరిధిలో క్వారీల అక్రమ "దందా":

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దాదాపు 400కు పైగా గ్రానైట్, మైనింగ్ క్వారీలు ఉండగా,అందులో కొన్ని మూసివేసినట్లు తెలుస్తోంది..కానీ ప్రస్తుతం కరీంనగర్ జిల్లాలోని ఒక కొత్తపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోనే రన్నింగ్‌లో ఉన్న 10 క్వారీలు భారీ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.ఒక క్వారీ పేరుతో పర్మిషన్ తీసుకుని, లీగల్‌గా ఎలాంటి అనుమతులు లేని మరొక క్వారీ నుండి బ్లాకులను రవాణా చేస్తున్నట్లు పోలీసు తనిఖీల్లో తేటతెల్లమైంది. గతంలో పన్నుల ఎగవేతపై రాష్ట్ర విజిలెన్స్ కమిటీ సైతం నివేదికలు సమర్పించినప్పటికీ, సదరు వ్యాపారులు జరిమానాలు కట్టకుండా కాలయాపన చేస్తూ వస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఈ అక్రమ మైనింగ్ మాఫియాను అడ్డుకోవడానికి స్థానికంగా ఎవరూ సాహసించడం లేదంటే వీరి పలుకుబడి ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు...

### పన్నుల దోపిడీపై ఉన్నతాధికారులు స్పందించేనా..?

రాత్రి,పగలు తేడా లేకుండా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి ఇతర ప్రాంతాలకు రోడ్డు,రైలు మార్గంతో పాటు,ఓడరేవులకు తరలిపోతున్న గ్రానైట్ బ్లాకుల వెనుక ఉన్న సూత్రధారులపై నిష్పాక్షిక విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. మైనింగ్, పోలీస్,రవాణాశాఖ,జీఎస్టీ విభాగాలు సమన్వయంతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కఠిన తనిఖీలు చేపడితేనే ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతూ, నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్ అక్రమ రవాణాను సాగిస్తున్న వారిపై,ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి, ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి మరి..




## రేపటి నుంచి శాతవాహనలో

# టీజీ పీఈసెట్ పరీక్షలు

**కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు అందించే 2 సంవత్సరాల బిపిఇడి, డిపిఇడి కోర్సులలో 202627 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం, హైదరాబాద్‌లోని తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో తెలంగాణ శారీరక విద్య ఉమ్మడి ప్రవేశ పరీక్ష 2026 (టిజి పిఇసెట్2026) నిర్వహించబడుతుందని వైస్ చాన్సలర్ ఆచార్య ఉమేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం కరీంనగర్ శాతవాహన యూనివర్సిటీలో ప్రెస్ మీట్ నిర్వహించి ఆయన వివరాలు వెల్లడించారు... ఈ పరీక్షను తెలంగాణలోని కరీంనగర్‌లో ఉన్న శాతవాహన విశ్వవిద్యాలయం నిర్వహిస్తోందన్నారు. ఈ పరీక్ష మే 31 నుండి జూన్ 3 వరకు శాతవాహన విశ్వవిద్యాలయంలో జరుగుతుందన్నారు. శారీరక సామర్థ్య, నైపుణ్య పరీక్షలు శాతవాహన విశ్వవిద్యాలయం క్రీడా మైదానంలో నిర్వహించబడతాయన్నారు. కన్వీనర్ ఆచార్య రాజేష్ కుమార్ మాట్లాడుతూ శారీరక దృఢత్వ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిస్టారెడ్డి, శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మే 31న ఉదయం 6.30 గంటలకు జరిగే ప్రారంభోత్సవానికి అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. తాత్కాలిక ఫలితాలు జూన్ 6న ప్రకటించబడతాయనీ తెలిపారు..ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.




# ఎర్రటి ఎండలో స్వచ్ఛ సేవకులు...

### పుష్కర జన సంద్రంలో పంచాయతీ సిబ్బంది అపర భగీరథ ప్రయత్నం...!
### రెండు షిఫ్టుల్లో నిరంతర సమరం..
### నీటిలోనూ, నేలపైనా... అడుగడుగునా స్వచ్ఛత...!
### సేవల వెనుక కనిపించని త్యాగం....

**కాళేశ్వరం(పలిమెల), మే 29, ప్రభాతవార్త** కళ్ళు బైర్లు గమ్మే ఎండ... అడుగుతీసి అడుగు వేస్తే పాదాలు కాలే ఇసుక తిన్నెలు... లక్షలాది మంది భక్తుల రాకతో కిక్కిరిసిన పుష్కర ఘాట్లు... కానీ అక్కడ ఒక చిన్న కాగితం ముక్క గానీ, ప్లాస్టిక్ కవర్ గానీ కనిపించడానికి వీల్లేదు. ఎందుకంటే అక్కడ శ్రమిస్తోంది కేవలం కార్మికులు కాదు, భక్తుల ఆరోగ్యమే పరమావధిగా భావిస్తున్న 'స్వచ్ఛత సైనికులు'. కాళేశ్వరంలో జరుగుతున్న అత్యంత పవిత్రమైన సరస్వతి అంత్య పుష్కరాలలో తెరవెనుక ఉండి ఉత్సవాన్ని నడిపిస్తున్న అసలైన సూత్రధారులు మన పంచాయతీ రాజ్ సిబ్బంది.ఎండను లెక్కచేయక, అలసటను దరిచేరనీయక, అహోరాత్రులు వారు చేస్తున్న సేవలు పుష్కరాల విజయవంతంలో అత్యంత కీలకంగా మారాయి.రెండు షిఫ్టుల్లో నిరంతర సమరం..పుష్కర క్షేత్రం 24 గంటలూ భక్తులతో కళకళలాడుతోంది. దానికి తగ్గట్టుగానే పంచాయతీ రాజ్ యంత్రాంగం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. ప్రతిరోజూ ఉదయం 6 గంటలకే మొదటి షిఫ్ట్ పారిశుధ్య పనులు ప్రారంభమవుతాయి. రాత్రి 10 గంటల వరకు రెండు షిఫ్టులలో సిబ్బంది అలసట లేకుండా పనిచేస్తున్నారు.సుమారు 300 మంది పారిశుధ్య కార్మికులు క్షేత్రస్థాయిలో నిరంతరం చెత్తను సేకరిస్తూ, ఊడుస్తూ, బ్లీచింగ్ చల్లుతూ అహర్నిశలు శ్రమిస్తున్నారు. సుమారుగా 80 మంది పంచాయతీ కార్యదర్శులు ప్రతి విభాగాన్ని, ప్రతి వీధిని పర్యవేక్షిస్తూ కార్మికులకు దిశా నిర్దేశం చేస్తున్నారు.మండల పంచాయతీ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయతి అధికారి, మరియు జిల్లా పంచాయతి అధికారి క్షేత్రస్థాయిలోనే మోహరించి, క్షణం తీరిక లేకుండా పనులను సమన్వయం చేస్తున్నారు.

### నీటిలోనూ, నేలపైనా... అడుగడుగునా స్వచ్ఛ!...

సాధారణంగా పండగల్లో రోడ్లు మాత్రమే ఊడుస్తారు. కానీ కాళేశ్వరం పుష్కరాల్లో పంచాయతి సిబ్బంది సాహసమే చేస్తున్నారని చెప్పాలి. భక్తులు వదిలేసిన పాత బట్టలు, పూజా సామగ్రి నదిలో పేరుకుపోకుండా, ప్రమాదకరమైన గోదావరి త్రివేణి సంగమ నీటి ప్రవాహంలోకి సైతం దిగి సిబ్బంది వ్యర్థాలను తొలగిస్తున్నారు. భక్తుల ఆరోగ్యం పాడవకూడదనే ఏకైక లక్ష్యంతో నీటిని సైతం పవిత్రంగా ఉంచుతున్నారు. ప్రధాన ఘాట్, సరస్వతి ఘాట్ పరిసర ప్రాంతాలతో పాటు, కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ వీధులన్నింటినీ ఎప్పటికప్పుడు ఐస్‌క్రీం కప్పులు, ప్లాస్టిక్ బాటిళ్లు లేకుండా క్లీన్ చేస్తున్నారు. రహదారులు మరియు పార్కింగ్ స్థలాలు వాహనాల రాకతో దుమ్ము లేచే పార్కింగ్ ప్రదేశాలను, ప్రధాన రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నారు.రాత్రివేళల్లోనూ కొనసాగుతున్న సేవలు..పగలు మాత్రమే కాదు.. రాత్రి వేళల్లో కూడా పంచాయతీ సిబ్బంది సేవలు ఆగడం లేదు. వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారులకు ఇరువైపులా లైనింగ్ వేయడంతో పాటు వాటరింగ్ నిర్వహిస్తున్నారు. దుమ్ము రేగకుండా ప్రత్యేక ట్యాంకర్ల ద్వారా నీటిని చల్లుతూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నారు. పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ చెత్త పరిమాణం కూడా అధికమవుతుండటంతో చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాలు, ట్రాక్టర్లు, డంపర్లు వినియోగిస్తున్నారు. ప్రతి గంటకోసారి చెత్తను తరలిస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నారు.

### "ప్రజల ఆరోగ్యమే మా ముఖ్యం" కార్యదర్శుల సంకల్పం...

పుష్కరాలకు వచ్చిన భక్తులు ఆరోగ్యంగా తిరిగి వెళ్లాలి.. అదే మా లక్ష్యం" అని పంచాయతి కార్యదర్శులు చెబుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసమే పనిచేస్తున్నామని వారు పేర్కొంటున్నారు. చాలామంది సిబ్బంది తగిన విశ్రాంతి కూడా లేకుండా గంటల తరబడి విధులు నిర్వహిస్తున్నప్పటికీ సేవా భావంతో పనిచేస్తున్నారు.కొంతమంది సిబ్బంది చెత్తను చేతులతోనే తొలగిస్తూ, డ్రైనేజీలను శుభ్రం చేస్తూ, మరుగుదొడ్ల పరిశుభ్రతను పర్యవేక్షిస్తూ నిరంతరం శ్రమిస్తున్నారు. కొందరు మహిళా సిబ్బంది కూడా పురుషులతో సమానంగా ఎండలో పనిచేస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు.

### ప్రతి శాఖతో సమన్వయం....

పంచాయతీరాజ్ శాఖతో పాటు వైద్య ఆరోగ్య శాఖ, విద్యుత్ శాఖ, పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేస్తూ అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా అంటువ్యాధులు వ్యాపించకుండా బ్లీచింగ్, ఫాగింగ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తున్నారు.ప్రధాన ఘాట్ల వద్ద తాగునీటి సదుపాయం, తాత్కాలిక మరుగుదొడ్లు, చెత్త బుట్టలు ఏర్పాటు చేసి వాటి నిర్వహణపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతోంది. భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని మోహరించారు.

### సేవల వెనుక కనిపించని త్యాగం....

భక్తులు ప్రశాంతంగా పుష్కర స్నానాలు చేయగలుగుతున్నారంటే దాని వెనుక పంచాయతీ సిబ్బంది కష్టమే ప్రధాన కారణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు చెమటోడ్చుతూ పనిచేస్తున్న ఈ సిబ్బంది సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయి.

# లక్కారం ధాన్యం కేంద్రంలో అక్రమ దందా !

నిర్వహకులు, హమాలీల చేతివాటం

పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కిన కొనుగోలు వ్యవహారం

రంగంలోకి దిగిన ముత్తారం ఎస్ఐ

**ముత్తారం, ప్రభాతవార్త:**

ముత్తారం మండలంలోని లక్కారం ధాన్యం కొనుగోలు కేంద్రంలో భారీ అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో ఒకవైపు రైతులు తాము పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి అష్టకష్టాలు పడుతున్నారు. మరోవైపు కేంద్రం ఇన్‌ఛార్జిలు, హమాలీలు చేతివాటం ప్రదర్శిస్తూ ప్రభుత్వ ధనాన్ని దోచుకుంటున్నారు.రూ.2,369 ధరతో జేబులు నింపుకున్నారుమార్కెట్లో కేవలం రూ.1200 నుండి రూ.1400 ధర పలికే, మద్దతు ధర లేని మగ సీడ్ వడ్లను వీరు టార్గెట్ చేశారు. ప్రభుత్వం సాధారణ రైతులకు అందించే రూ.2,369 కామన్ ధర కింద ఆ తక్కువ రకం వడ్లను సంచులు కాంటాలు వేసిన హమాలీలు, సెంటర్ ఇన్‌ఛార్జిలు ఈ అక్రమాలకు తెరలేపారు. ఈ విధంగా తక్కువ ధరకు వచ్చే వడ్లను మద్దతు ధరకు అమ్ముకుంటూ రైస్ మిల్లులకు తరలించి సొమ్ము చేసుకున్నారు. ఈ తరహాలో సుమారు 500 క్వింటాళ్ల వరకు ధాన్యం అక్రమాలు జరిగినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. అంతేగాకుండా ముత్తారం మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో కూడా ఇన్‌ఛార్జిలు ఇదే తరహాలో అక్రమాలు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ దందాలపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టినట్లయితే మరెన్నో అక్రమాలు వెలుగు చూసే అవకాశాలు న్నాయని పలువురు చర్చిస్తున్నారు.

**విచారణ ప్రారంభించిన ఎస్ఐ**

ఈ అక్రమ దందా వ్యవహారం కాస్త బయటకు పొక్కడంతో గొడవ పెద్దదై పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కింది. సమాచారం అందుకున్న ముత్తారం ఎస్ ఐ ఎన్.రవికుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ జరుగుతున్న కొనుగోళ్ల తీరును పరిశీలించి, అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ ప్రారంభించారు.

## పి ఎం జె దోపిడీ కేసులో ప్రధాన సూత్రధారి రిమాండ్

పిటి వారెంట్ పై తీసుకువచ్చిన కరీంనగర్ పోలీసులు

కస్టడీ కోసం పిటిషన్ దాఖలు

**కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త:**

కరీంనగర్ జిల్లా కేంద్రంలో సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలర్స్ దోపిడీ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న సుబోధ్ సింగ్ ను పోలీసులు రిమాండ్ కు తరలించారు. బీహార్ లోని పూర్ణియా జైల్లో ఉన్న సుబోధ్ సింగ్ పై స్థానికంగా కూడా అనేక కేసులు ఉన్నాయి. అక్కడి కేసుల్లో భాగంగా అన్ని కోర్టుల్లో పీటీ వారంట్ దాతలు చేసిన కరీంనగర్ పోలీసులు గురువారం రాత్రి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసి కరీంనగర్కు తీసుకువచ్చారు. అనంతరం నిందితున్ని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచయ రిమాండ్ విధించడంతో కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఇప్పటికే ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు వారి నుండి ఎలాంటి సమాచారం రాకపోవడంతో పాటు మరికొంతమంది



నిందితులు పరారీ లోనే ఉండడం కేసు చిక్కుముడి వీడు ఎందుకు కష్టతరంగా మారింది. ఈ నేపథ్యంలో ప్రధాన సూత్రధారుడిగా భావించిన నిందితుడిని తీసుకువచ్చిన కరీంనగర్ పోలీసులు శుక్రవారం ఉదయం నిందితున్ని కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. పోలీసుల కస్టడీ పిటిషన్ పై ఇంకా నిర్ణయం వెలువడకపోవడంతో తదుపరి చర్యల కోసం పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. కస్టడీకి కోర్టు అనుమతిస్తే సుబోధ్ ముఠా సభ్యుల వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు రికవరీ కూడా కాకపోవడం మరికొందరు నిందితులు పట్టుబడక పోవడంతో కస్టడీలోకి కోర్టు అనుమతిస్తే ప్రధాన సూత్రధారి సుబోధ సింగ్ నుండి పూర్తి సమాచారం రాబట్టే అవకాశం ఉంది.

## భార్యను చంపి,భర్త ఉరివేసుకొని ఆత్మహత్య

**తంగళ్ళపల్లి ప్రభాతవార్త**

భార్యను చంపి,భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన మహమ్మద్ షరుద్దీన్ (60) భార్య సాహిన్‌ను హత్య చేసి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అవినీతిపై చర్చకు సిద్ధమా

బి జె పి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఒరుగంటి చంద్రశేఖర్

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త :**

అవినీతిపై చర్చకు సిద్ధమా అని రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఒరుగంటి చంద్రశేఖర్ అన్నారు.జగిత్యాల పట్టణంలోని స్థానిక ప్రెస్ క్లబ్లో బి జె పి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఒరుగంటి చంద్రశేఖర్ , భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల తిరుపతి, ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ "గత 12 సంవత్సరాలుగా జగిత్యాలలో జరిగిన అవినీతిపై మీరు ప్రజల ముందుకు వచ్చి చర్చకు సిద్ధమా..? ఓపెన్ డిబేట్‌కు రావాలి" అంటూ ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు.డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. "మొదట కాంట్రాక్టర్లు మీ కమిషన్లకు భయపడి పనులు వదిలేసి వెళ్లిపోయారని, తర్వాత మీ వియ్యంకుడి ద్వారా పనులు చేయించారని విమర్శించారు.సమీకృత మార్కెట్ పేరుతో రైతుల పొట్ట కొట్టారని మండిపడ్డారు. నర్సింగాపూర్ ప్రాంతంలో జరుగుతున్న మొరం అక్రమ రవాణాకు ఎమ్మెల్యే అనుచరులే కారణమని అన్నారు.మున్సిపల్ కార్యాలయంలో జరిగిన అవినీతిపై ఎమ్మెల్యే మాట్లాడడం హాస్యాస్పదమన్నారు.



## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ

**మంథని రూరల్ ప్రభాతవార్త :**



మంథని మండలం కన్నాల గ్రామంలోని ఊర చెరువులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పూడికతీత పనులు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు కన్నాల గ్రామపంచాయతీ తరపున కన్నాల గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ పంపిణీ చేశారు . ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గాదె దివ్య సంజీవరెడ్డి,సీనియర్ కాంగ్రెస్ నాయకులు కావటి సందీప్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి మధుకర్, ఫీల్డ్ అసిస్టెంట్ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;**

వీణవంక మండలంలోని ఎలుబాక గ్రామానికి చెందిన పోలు స్వప్న (34) అనే మహిళ జమ్మికుంట బిసుగిరిషరీఫ్ రైల్వే స్టేషన్ల మధ్య జమ్మికుంట రైల్వే ఎలక్ట్రిక్ సబ్ స్టేషన్ వద్ద బహుశా ఏదో ఎగువ రైలు బండి కింద పడి ఆత్మహత్య చేసుకుని మృతి చెందినట్లు రామగుండం ప్రభుత్వ రైల్వే హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపారు. మృతురాలు వద్ద మెరూన్ చుడిదార్ దానిపై నలుపు తెలుపు డిజైన్ కలది పూర్తిగా చినిగిపోయి ఉన్నదని తల పగిలి పూర్తిగా నుజ్జు నుజ్జు అయినందున ముఖం గుర్తు పట్టుటకు వీలు లేకుండా ఉన్నదని తెలిపారు.భర్త వెంకటేష్ అత్త సుగుణ పెట్టిన బాధలు భరించలేక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి దొప్ప రాజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామగుండం ప్రభుత్వ రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేరాలు-దారుణాలు

## చికిత్స పొందుతూ రైతు మృతి

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**

గడ్డి మందు తాగి ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతూ రైతు శుక్రవారం మృతి చెందాడు. గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పల్వంచ అశోక్ (39) గత బుధవారము ఇంటి నుండి వెళ్లి వ్యవసాయ బావి వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్య కు పాల్పడగా, కుటుంబీకులు తక్షణము ప్రాణాపాయ స్థితిలో ఎల్లారెడ్డిపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. వ్యవసాయ బావి వద్ద బోర్ ఎండి పంట చేతికి రాకపోగా, ఇంటి నిర్మాణానికి చేసిన అప్పులు తీర్చలేక నిత్యం మనోవేదనతో ఆత్మహత్యకు పాల్పడినట్లుగా భార్య లావణ్య పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. తన భర్త పై ఎలాంటి అనుమానం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

## ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి

**గంభీరావుపేట: ప్రభాతవార్త:**



ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. మండల పరిధిలోని లక్ష్మీ పూర్ తాండాకు చెందిన బానోత్ శర్వన్ (48) తన వ్యవసాయ బావి సమీపంలో ఉన్న కాలువలో చేపలు పడుతుండగా ప్రమాదవ శాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుగుతున్నట్లు ఎస్సై అనిల్ కుమార్ తెలిపారు.

## కోరపల్లి ఎల్లమ్మ తల్లి ఆలయంలో చోరీ

**జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;**



జమ్మికుంట మండలంలోని కోరపల్లి గ్రామంలో గల ఎల్లమ్మ తల్లి దేవాలయంలో గుర్తుతెలియని దుండగులు ఆలయం యొక్క హుండీని పగలగొట్టి అందులో ఉన్న 20వేల రూపాయల నగదు తో పాటు భక్తులు సమర్పించిన కానుకలను దొంగిలించారు. గత నాలుగు సంవత్సరాల నుండి భక్తులు సమర్పించిన కానుకలు హుండీలోనే ఉన్నాయని అప్పటినుండి హుండీని లెక్కించడం చేయలేదని పెద్ద మొత్తంలో దొంగతనం జరిగినట్లు గౌడ కులస్తులు తెలిపారు. గతంలో ఇదే మాదిరిగా వీణవంక మండలంలోని కొండపాక గ్రామం తో పాటు పలు గ్రామాలలో చివరన ఉన్న ఎల్లమ్మ తల్లి దేవాలయాలలో చోరీలు జరగడం జరిగిందని గౌడ కులస్తులు తెలిపారు.

## బీ ఆర్ ఎస్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌ని కలిసిన స్వామి వివేక్ పటేల్

**పెద్దపల్లి, ప్రభాతవార్త:**

పెద్దపల్లి నియోజకవర్గానికి భారత రాష్ట్ర సమితి పార్టీ సభ్యత్వ నమోదు ఇంచార్జ్‌గా నూతనంగా నియామకం పొందిన ఎమ్మెల్సీ పరిపాటి వెంకటరామిరెడ్డి బీ ఆర్ ఎస్ రాష్ట్ర నాయకుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం, గ్రామ స్థాయిలో పార్టీ కార్యకర్తలను మరింత చైతన్యపరిచే అంశాలపై చర్చించినట్లు తెలిపారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దిశానిర్దేశం చేసినట్లు ఆకుల స్వామి వివేక్ పటేల్ తెలిపారు.



# ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిర్వచనం..

**ప్రజల భద్రతే లక్ష్యంగా ఎస్ఐ ఎం. శ్రీధర్ రెడ్డి సేవలు**

**సైబర్ నేరాలు, డ్రగ్స్, ఆన్‌లైన్ మోసాలపై నిరంతర అవగాహన**

భీమారం/మేడిపల్లి, ప్రభాతవార్త:

ఉమ్మడి మేడిపల్లి మండల ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించడంలో పోలీస్ శాఖ కీలక పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా మేడిపల్లి మండల పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎం. శ్రీధర్ రెడ్డి ప్రజల మధ్యకు వెళ్లి నేరాలపై అవగాహన కల్పిస్తూ "ఫ్రెండ్లీ పోలీసింగ్" చేస్తున్నారు. గ్రామాల్లో మైక్ ప్రకటనలు, అవగాహన సమావేశాలు, సోషల్ మీడియా ద్వారా ప్రజలను అప్రమత్తం చేస్తూ "జాగ్రత్తే రక్ష" అనే సందేశాన్ని ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం సమాజాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న డ్రగ్స్ సమస్యపై ఎస్ఐ శ్రీధర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. యువత సరదాగా మొదలుపెట్టే మాదకద్రవ్యాల అలవాటు చివరకు వారి భవిష్యత్తును నాశనం చేస్తుందని హెచ్చరిస్తున్నారు. ఒక్కసారి డ్రగ్స్ అలవాటు పడితే జీవితం చీకటిలోకి వెళ్లిపోతుందని ఆయన పేర్కొంటూ విద్యార్థులు, యువతను అప్రమత్తం చేస్తున్నారు. ఆరోగ్యం, చదువు, ఉద్యోగం, కుటుంబ జీవితం అన్నింటిపై డ్రగ్స్ తీవ్ర ప్రభావం చూపుతాయని చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో మార్పులు గమనిస్తే వెంటనే స్పందించాలని సూచిస్తున్నారు. ఇక గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న మల్టీ లెవల్ మార్కెటింగ్ మోసాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.



"ఇంట్లో కూర్చొని లక్షలు సంపాదించండి", "ఇద్దరిని చేర్పితే డబ్బులు వస్తాయి" వంటి ప్రకటనలు మోసపూరితమైనవేనని స్పష్టం చేస్తున్నారు. బైక్స్, ప్రొడక్ట్స్, మెడిసిన్స్ పేరుతో అమాయకులను వలలోకి దింపి డబ్బులు దోచుకుంటున్న ముఠాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. క్రిప్టో కరెన్సీ పెట్టుబడుల పేరుతో జరుగుతున్న మోసాలపై కూడా ఎస్ఐ ప్రజలను హెచ్చరిస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు, టెలిగ్రామ్ ఛానళ్లలో నకిలీ స్క్రీన్ షాట్లు చూపించి భారీ లాభాలు వస్తాయని నమ్మిస్తున్నారని, ఒకసారి డబ్బులు పంపితే తిరిగి పొందడం కష్టమని చెబుతున్నారు. తెలియని యాప్స్ డౌన్‌లోడ్ చేయడం, వ్యక్తిగత బ్యాంక్ వివరాలు పంచుకోవడం ప్రమాదకరమని హెచ్చరిస్తున్నారు. నకిలీ జాబ్ ఆఫర్ల విషయంలో యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సూచిస్తున్నారు. "రోజుకు రెండు గంటలు పని చేస్తే వేల రూపాయలు సంపాదించవచ్చు" వంటి ప్రకటనలు ఎక్కువగా మోసపూరితమైనవేనన్నారు. ఉద్యోగం ఇస్తామని చెప్పి ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజులు, డాక్యుమెంట్లు తీసుకుని మోసం చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు. లాటరీలు, బెట్టింగ్ యాప్స్, "100 శాతం ఖచ్చితమైన షాట్" అంటూ వచ్చే ప్రకటనలను నమ్మవద్దని ప్రజలకు సూచిస్తున్నారు. మ్యాచ్ ఫలితాలను ఎవరూ ముందుగా చెప్పలేరని, అలాంటి ప్రకటనలు కేవలం ప్రజలను మోసం చేయడానికేనని హెచ్చరిస్తున్నారు. "మీకు లాటరీ వచ్చింది.. ట్యాక్స్ కడితే డబ్బులు పంపిస్తాం" అంటూ వచ్చే కాల్స్ పూర్తిగా నకిలీవని స్పష్టం చేస్తున్నారు. ప్రజలు ఎలాంటి అనుమానాస్పద కాల్స్, లింక్స్, యాప్స్, పెట్టుబడుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎం. శ్రీధర్ రెడ్డి సూచిస్తున్నారు. అత్యాశ, తెలియని వ్యక్తుల మాటలు, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలు నమ్మితే మోసపోయే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటేనే సైబర్ నేరాలను అరికట్టగలమన్నారు. పోలీస్ స్టేషన్కే పరిమితం కాకుండా ప్రజల మధ్యలోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్నారు. ఉమ్మడి మేడిపల్లి మండల ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ "ఫ్రెండ్లీ పోలీస్"కు నిజమైన నిర్వచనంగా నిలుస్తున్నారు.

## కోరుట్ల వార్త

## నియోజకవర్గంలోనే మొదటి ప్రాధాన్యతగా కథలాపూర్ మండలానికి నిధులు మంజూరు

**కథలాపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు**

కథలాపూర్ ప్రభాతవార్త



కథలాపూర్ మండలానికి పలు అభివృద్ధి పనుల నిమిత్తమై ఒక కోటి 28 లక్షల 40 వేల రూపాయలను స్టేట్ డెవలప్మెంట్ ఫండ్ కింద స్థానిక శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చొరవతో మంజూరు అయినట్లు కథలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు శుక్రవారం పాత్రికేయుల సమావేశంలో తెలిపారు , మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనునిత్యం ప్రజలలో ఉంటూ ప్రజల కష్టసుఖాలలో పాలుపంచుకునే ఎమ్మెల్యే మనకు ఉండడం మన అందరి అదృష్టంగా భావిస్తున్నానని, మన వేములవాడ నియోజకవర్గంలోనే మొదటి ప్రాధాన్యతగా మన మండలానికి ప్రాధాన్యతనిస్తూ ఒక కోటి 28 లక్షల 40 వేల రూపాయలను కేటాయించినందుకు గాను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ఈ సందర్భంగా మండలం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## మత సామరస్యాన్ని భంగంపరిచే విధంగా వ్యవహరించిన వారిపై కేసు నమోదు

కోరుట్ల, ప్రభాతవార్త :

శుక్రవారం రాత్రి సుమారు 8గంటలకు కొరుట్లలోని కపిల్ చిట్ ఫండ్ ఆఫీస్ ఎదురుగా ఉన్న ఎన్‌హెచ్63 రహదారిపై గుర్తు తెలియని వ్యక్తులు జంతువుల కళేబరాలు పడవేసినారు. సమాచారం అందుకున్న పోలీస్, మునిసిపల్ సిబ్బంది వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, మున్సిపల్ సిబ్బంది వెంటనే వాటిని తొలగించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు బక్రీద్ పండుగ సందర్భంగా సామాజిక సామరస్యాన్ని భంగపరచే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు అనుమానించబడింది. వెంటనే సానిటరీ ఇన్స్పెక్టర్ వద్ద ఫిర్యాదు తీసుకోని ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. వెంటనే స్పెషల్ టీం లను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించి అట్టి వాహనంను, దాని వివరాలు తెలుసుకొని, ఆ వాహనాన్ని రాత్రే అదుపులోకి తీసుకున్నామని, ఆ వాహనం యొక్క యజమాని, వాహనం నడిపిన డ్రైవర్ ను అదుపులోకి తీసుకోని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తా

కోరుట్ల, ప్రభాతవార్త :



టిపిసిసి ఎస్సి సెల్ డిపార్ట్మెంట్ రాష్ట్ర సెక్రటరీగా ఇటీవల నియాకమైన కొండ్లేపు అర్జున్ (మోచి) 57 ఎంబిఎస్సి కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం ను గురువారం సిద్దిపేట లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొండ్లెపు అర్జున్ బైరి వెంకటేశం కు శాలువా కప్పి ఆత్మీయ సన్మానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన షెడ్యూల్ కులాల బలోపేతం కోసం కృషి చేస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ పటిష్టతకు పాటుపడతానని పేర్కొన్నారు. ఇట్టి అవకాశం కల్పించి తన నియామకానికి సహకరించిన పిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, పిసిసి డిపార్ట్మెంట్ చైర్మన్ మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, 57 ఎంబిఎస్సి కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు బైరి వెంకటేశం కి కృతజ్ఞతలు తెలిపారు...

## మహిళలకు వివిఅర్ ఫౌండేషన్ సహకారంతో ఉచిత కంప్యూటర్ శిక్షణ

రామడుగు, ప్రభాత వార్త



వివిఆర్ ఫౌండేషన్ సహకారంతో వెలిచాలా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామ మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ వీర్ల నర్సింగరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని వినోయోగించుకొని మహిళలు విద్యార్థినులు భవిష్యత్ లో ఉన్నత స్థాయి కి చేరుకోవాలన్నారు. వివియర్ ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వీర్ల రవీందర్ రావు, ఉప సర్పంచ్ ఎల్లమల్ల వసంత , వార్డు సభ్యులు , వీర్ల సంజీవరావు , బంధారపు అజయ్ కుమార్ గౌడ్, గ్రామ మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాల సమీప రోడ్లపై కాళేబరాలు పడవేతపై ఫిర్యాదు

**హిందూ నాయకులపై దురుసుగా ప్రవర్తించినా ఎస్ఐ చిరంజీవి**

కోరుట్ల, ప్రభాతవార్త :

బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు కోరుట్ల పట్టణంలో జరిగిన ఘటనపై మెట్ పల్లి డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. గురువారం బక్రీద్ సందర్భంగా గోవధ చేసి, ఆ కాళేబరాలను కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ లక్ష్మి ౖ నారాయణ దేవాలయం, హనుమాన్ దేవాలయం పరిసరాల్లో ఉద్దేశ్యపూర్వకంగా పడవేసినట్లు ఆరోపిస్తూ వారు పోలీసులకు ఫిర్యాదు సమర్పించారు. ఈ ఘటన హిందువుల మనోభావాలను దెబ్బతీయడంతో పాటు, పట్టణంలో శాంతి భద్రతలకు భంగం కలిగించేలా ఉందని వారు పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు కోరుట్లలో శాంతియుతంగా ఉన్న హిందువులను రెచ్చగొట్టి గొడవలకు దారితీసే ప్రయత్నం చేస్తున్నారని, ఈ ఘటన దానికి నిదర్శనమని వారు ఆరోపించారు. సంఘటన స్థలానికి చేరుకున్న హిందువులు సంబంధిత ఆటో ఫొటోలు, ఆటో నంబర్‌ను కోరుట్ల ఎస్ఐ చిరంజీవి కి అందజేసి, ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఎస్ఐ చిరంజీవి హిందువులపైనే అనుమానాలు వ్యక్తం చేస్తూ దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ, ఆయన వ్యవహారశైలిపై కూడా డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు నాయకులు వెల్లడించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



## గర్భధారణ నుండి బిడ్డ వెయ్యి రోజుల సంరక్షణ పై అవగాహన కార్యక్రమం

మేడిపల్లి, ప్రభాతవార్త :



మండల కేంద్రంలో శుక్రవారం గర్భధారణ నుండి బిడ్డ వెయ్యి రోజుల సంరక్షణ పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్బంగా మెడికల్ ఆఫీసర్ రమ మాట్లాడుతూ గర్భా ధారణ నుండి రెండేళ్లు పూర్తయ్యే వరకు వున్న కాలం ఎంతో ప్రాముఖ్యమైన దన్నారు. ఆ కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తి గత పరిశుభ్రత, తల్లి పాల ప్రాముఖ్యత ను వివరించారు. గ్రామ సర్పంచ్ మకిలి దాసు మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం, ఆరోగ్య సంరక్షణ పై అశ్రద్ధ చూపవద్దని తెలిపారు.. ఎంజిఓ శ్యామల మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో ఐసీడీస్ సూపర్ వైజర్ షైని మాథు భాగ్యలక్ష్మి ౖ, వి ఓ ఏ భార్గవి, రమ ఆశాలు మణెమ్మ, పుష్ప, ఎస్తేరు, అంగన్వాడీ టీచర్లు ధనలక్ష్మి ౖ, స్వప్న, శారద, నర్మదా, గీత, మహిళా సంఘ సభ్యులతో పాటు ఉప సర్పంచ్ తోపారపు అర్జున్, వార్డ్ సభ్యులు సుజాత, మానసలు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

**కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, మే 29, ప్రభాతవార్త :**



ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. శుక్రవారం జిల్లా పర్యటనలో భాగంగా సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎస్పి నితికా పంత్ లతో కలిసి వందేమాతర గీతం ఆలపించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రజలకు అందించే పౌష్టిక ఆహారం, ప్రజల ఆరోగ్యంపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ మాట్లాడుతూ జిల్లా వైద్య పరంగా రోగులకు మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. జిల్లాలో 464 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, వారికి జిల్లా అధికారులు ఒక్కొక్కరిని దత్తత తీసుకొని, నెలకు సరిపడా మందులు, పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. చాలామంది రోజు దగ్గు, బరువు తగ్గుదల, ఆరోగ్య క్షీణతపై బయటకు చెప్పకుండా లోలోపల మదన పడుతుంటారని, సమాజం చిన్నచూపు చూస్తారని, ఎవరికీ చెప్పకుండా ఆందోళన చెంచుతుంటారని, అలాంటి వారిని గుర్తించి వారికి సరైన వైద్య చికిత్సలు అందించాలని తెలిపారు. చికిత్స అనంతరం క్షయ వ్యాధి నయం అవుతుందని అవగాహన కల్పించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు, మత్తుకు బానిసై తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకుంటున్నాయని స్వయం సహాయక



సంఘాల సహకారం తీసుకోవాలని వివరించారు. జిల్లా అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని,జిల్లాలో అభివృద్ధి పథంలో తీసుకువెళ్లాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో శాఖల వారీగా చేపడుతున్న సేవలు, సంక్షేమ అభివృద్ధి పనులపై గవర్నర్ కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎస్పి నితికా పంత్ జిల్లాలో శాంతి భద్రతల పట్ల, మాదకద్రవ్యాల చర్యలపై వివరించారు. అంతకుముందు హెలికాప్టర్ ద్వారా జిల్లా కేంద్రానికి విచ్చేసిన రాష్ట్ర గవర్నర్ కు జిల్లా కలెక్టర్, ఎస్పి, జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. రెడ్ క్రాస్ సొసైటీలో సభ్యత్వం తీసుకున్న కలెక్టర్ కు ధృవపత్రం ప్రధానం చేశారు. రాష్ట్ర గవర్నర్, ప్రత్యేక ముఖ్య కార్యదర్శి లకు జిల్లా అధికారులు జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం. డేవిడ్, అదనపు ఎస్పి(అడ్మిన్) చిత్తరంజన్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ రాజస్వ మండల అధికారి లోకేశ్వర్ రావు, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, హరిష్ బాబు, ఎమ్మెల్సీ దండే విట్టల్, జిల్లా అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అన్‌లోడింగ్, కొనుగోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి: మే 29, ప్రభాతవార్త:**



జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగింపు దశకు చేరుకున్న నేపథ్యంలో, మిగిలిన ధాన్యం అన్‌లోడింగ్, కొనుగోలు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని స్పష్టం చేశారు.శుక్రవారం కలెక్టర్ ఖానాపూర్, కడెం మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఖానాపూర్ మండలం సత్తనపల్లి గ్రామంలోని ఏఆర్ఎస్ రైస్ మిల్లు, కడెం మండలంలోని లక్ష్మి అన్నపూర్ణ రైస్ మిల్లుతో పాటు నవాబ్‌పేట్, పెద్దబెల్లాల్, నచ్చన్ ఎల్లాపూర్ గ్రామాల్లోని పలు రైస్ మిల్లులను సందర్శించారు. మిల్లుల వద్ద జరుగుతున్న ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. మిల్లుల నిల్వ సామర్థ్యం, ఇప్పటివరకు అన్‌లోడ్ చేసిన ధాన్యం పరిమాణం, ఖాళీగా ఉన్న గోదాముల వివరాలు, రోజువారీ సగటు అన్‌లోడింగ్ సామర్థ్యంపై మిల్లు నిర్వాహకులను ఆరా తీశారు. స్టాక్ రిజిస్టర్లు, ఇతర రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లారీల్లో వచ్చే ధాన్యాన్ని త్వరగా దించేందుకు అవసరమైన మేరకు అదనపు హమాలీలను నియమించు కోవాలని మిల్లు యజమానులకు సూచించారు. అన్‌లోడింగ్‌లో ఏమాత్రం ఆలస్యం జరగకూడదని హెచ్చరించారు.స్థానిక అధికారులు ప్రతి రైస్ మిల్లు వద్ద అన్‌లోడింగ్ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా త్వరగా ఖాళీ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు గంటల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని, సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు, గోదాములకు తరలించాలని స్పష్టం చేశారు.మిల్లుల తనిఖీ అనంతరం కడెం మండల తహసిల్దార్ కార్యాల యంలో కలెక్టర్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల సంఖ్య, ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, ఇంకా కొనుగోలు చేయాల్సిన ధాన్యం వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు."రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది. చివరి రైతు వరకు న్యాయం జరగాలి. అందుకే మిగిలిన ప్రక్రియను వేగవంతం చేసి, వారంలోగా పూర్తి చేయాలి" అని కలెక్టర్ పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్, తహసీల్దార్లు సుజాత, మొయినుద్దీన్, ఎంపీడీవోలు రాధ, అరుణతో పాటు ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.ఈ యాసంగి సీజన్‌లో నిర్మల్ జిల్లాలో రికార్డు స్థాయిలో వరి దిగుబడి వచ్చింది. దీంతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యం పోటెత్తింది. గత వారం కురిసిన అకాల వర్షాల కారణంగా కొన్నిచోట్ల అన్‌లోడింగ్ ప్రక్రియ నెమ్మదించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ నేరుగా రంగంలోకి దిగి, ప్రక్రియ వేగవంతానికి చర్యలు చేపట్టారు.

# రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

**-తడిసిన ధాన్యం సేకరణకు రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త:



తడిసిన ధాన్యం సేకరణ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పేర్కొన్నారు.తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఇప్పటివరకు సేకరించిన ధాన్యం, తూకం వేసి తరలించడానికి సిద్ధంగా ఉన్న బస్తాల వివరాలను కొనుగోలు కేంద్రం నిర్వాహకులను అడిగి ఆరా తీశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ఈ సారి వరి దిగుబడి,కొనుగోలు కేంద్రాలకు రాక పెరిగిందని, జిల్లాలో నిన్నటివరకు 2 లక్షల 33 వేల 758 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటి దాకా 80 శాతం కొనుగోలు చేశామని తెలిపారు. డీఆర్డీఓ, సహకార శాఖ, మెప్మా, పౌర సరఫరాల శాఖ, రవాణా శాఖ ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కొనుగోలు తుది దశకు చేరుకున్నాయని వెల్లడించారు. కొనుగోలు కేంద్రాలు ధాన్యం, గోదాముల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగంగా పూర్తి చేసేలా మండలాలకు ప్రత్యేక అధికారులు, అన్ లోడింగ్ వద్ద అధికారులను నియమించి పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కొనుగోళ్ల ప్రక్రియ పై ప్రతి రోజు ఉదయం అన్ని శాఖల అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తూ.. కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలాల్లో కొంత వర్షం కురిసిందని, దీంతో తాను తంగళ్ళపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించానని పేర్కొన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని పౌర సరఫరాల శాఖ అధికారిని ఆదేశించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అపరల్ పార్క్, గోదాములకు తరలించి.. అక్కడ అన్ లోడింగ్ చేయిస్తున్నామని, హమాలీలకు నీరు, ఆహారం అన్ని వసతులు కల్పిస్తున్నామని తెలిపారు.వర్షం కారణంగా తడిసిన ధాన్యం సేకరణ విషయంలో ఇబ్బందులు లేవని, రైతులు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని కలెక్టర్ సూచించారు. తూకం వేసి ఉన్న ధాన్యం బస్తాలను తరలించడానికి వాహనాలను సమకూర్చాలని ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.అన్ని శాఖల సమన్వయంతో జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందని, సాధ్యమైనంత త్వరగా కొనుగోళ్ళు పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.కలెక్టర్ వెంట జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు..

# మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయం

కలెక్టర్ కుమార్ దీపక్

**నస్పూర్, మే 29, ప్రభాతవార్త:**

మహిళల ఆర్థిక అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికా 99 రోజుల కార్యాచరణలో మహిళా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్షెట్టిపేట, దండేపల్లి, హాజీపూర్ మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, అధికారులతో కలిసి స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా సమాఖ్య ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ రుణ సదుపాయాల ద్వారా వివిధ వ్యాపారాలలో మహిళలను ప్రోత్సహిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. బ్యాంకు లింకేజీ, ఎన్.ఆర్.ఎల్.ఎం., ప్యాడీ కమిషన్, పి.ఎం.ఎఫ్.ఎం.ఈ. పథకాలలో హాజీపూర్ మండలంలో 382 యూనిట్లకు గాను 18 కోట్ల 7 లక్షల రూపాయలు, దండేపల్లి మండలంలో 316 యూనిట్లకు గాను 16 కోట్ల 79 లక్షల రూపాయలు, లక్షెట్టిపేట మండలంలో 512 యూనిట్లకు వారం 18 కోట్ల 23 లక్షల రూపాయలు, మొత్తంగా 1 వేయి 210 స్వయం సహాయక సంఘాలకు 53 కోట్ల 10లక్షల 75 వేల రూపాయలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా స్వయం సహాయక సంఘ సభ్యులకు రుణాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఇందిరా మహిళా శక్తి ద్వారా లబ్ధి పొందిన స్వయం సహాయక సంఘాల మహిళలు, వారు ఆర్జించిన లాభాల నుంచి కొంత శాతం సంఘాల ఖాతాలలో పొదుపు చేయాలని, ప్రతి ఒక్కరికి సమాన లాభం చేకూర్చడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలను అభివృద్ధి చేయడం జరుగుతుందని, కమిటీ సభ్యులు పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచేలా కృషి చేయాలని, పిల్లలు హాజరు శాతం పెంచాలని తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఎలాంటి అవకతవకులకు తావు లేకుండా చూడాలని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా వేగవంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి భవన్ నిర్మాణం రాష్ట్రంలోని మొదటగా పూర్తయిందని, ఈ అవకాశాన్ని సంఘాల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం, మండల సమాఖ్య కార్యవర్గ సభ్యులు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, మహిళా స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.



# గీత కార్మికులను ఆదుకుంటాం

## దగ్ధమైన ఈత వనాల పరిశీలన.

## కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్.



**మెట్‌పల్లి,ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతైన ఈత చెట్లకు నష్ట పరిహారం అందేలా చూస్తామని,సంబంధిత గీత కార్మికులను పార్టీల కతీతంగా ఆదుకుంటామని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మండలంలోని మెట్ల చిట్టాపూర్,పెద్దాపూర్ గ్రామాల్లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో భారీ ఎత్తున ఈత వనాలు దగ్ధమవడంతో.. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా దగ్ధమైన ఈత వనాలను పరిశీలించిన ఎమ్మెల్యే సంజయ్,అగ్ని ప్రమాదం వల్ల జరిగిన నష్టంపై బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.ఎన్నో సంవత్సరాల శ్రమతో పెంచుకున్న ఈత చెట్లు అగ్నికి ఆహుతి కావడం బాధాకరమని,ఈ ఘటన వల్ల గౌడ కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయాన్ని బాధితులకు అందించేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గీత కార్మికులకు హామీ ఇచ్చారు.నష్టపోయిన వారికి న్యాయం జరిగేలా కృషి చేస్తానని,ఈత వనాలు జీవనాధారంగా ఉన్న కుటుంబాలు ఆందోళన చెందవద్దని,తాను ఎల్లప్పుడూ వారి వెంటే ఉంటానని ఎమ్మెల్యే సంజయ్ భరోసా ఇచ్చారు. అలాగే అగ్ని ప్రమాదాలకు గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకో వాలని సంబంధిత అధికారులకు సూచించారు.బాధితులకు అవసరమైన సహాయం అందించేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు పూదరి సుధాకర్ గౌడ్, ఎనగందుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యకాల్లు కాల్చితే చర్యలు తప్పవు

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**

చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామంలో వరి కొయ్యాకళ్ళను కాల్చడం వల్ల కలిగే నష్టాలపై రైతులకు శుక్రవారం రోజున మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ అధ్యక్షతన నిఘరణి సమితి ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ లో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బోయిని రమేష్ మాట్లాడుతూ, గ్రామంలో ఎవరూ పంట అవశేషాలను కాల్చవద్దని, ఒకవేళ కాల్చితే నిఘరణి సమితి పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఒక వేళ రైతులు ప్రభుత్వ సూచనలను పాటించకుండా పర్యావరణ పరిరక్షణకు నష్టం చేకూరిస్తే ఫైన్ విధిస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కావున రైతులు అందరూ సహకరించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి పున్నం చందర్ మాట్లాడుతూ రైతులు పంట అవశేషాలను కాల్చకుండా మల్చర్ శ్రేడర్లతో వాటిని భూమిలో కలపి వేస్ట్ డికంపోజర్ సింగిల్ సూపర్ పాస్ఫేట్ చల్లుకొని భూమిలో కుళ్ళిపజేసి నేల సారాన్ని పెంచుకోవాలన్నారు. లేదా పశువులకు మేతగా వినియోగించడం లేదా సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించాలని వారు సూచించారు. వ్యవసాయ విస్తరణ అధికారి ఆకుల ప్రణయ్ మాట్లాడుతూ వరి మిగులు అవశేషాలను కాల్చడం వల్ల భూమి సారవంతత తగ్గిపోవడం, గాలిలో కాలుష్యం పెరగడం, పర్యావరణానికి హాని కలగడం జరుగుతుందని వివరించారు. అలాగే మట్టిలో ఉన్న సూక్ష్మ జీవులు నశించి, భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎండీ కుత్బుద్దీన్, పంచాయతీ సెక్రటరీ అరుణ్, నిఘరణి సమితి సభ్యులు జక్కుల బాబు, చీల లక్ష్మారెడ్డి, పచ్చిమట్ల జగన్, డోకి నరేష్, పచ్చిమట్ల మధుసూదన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మరమ్మత్తుల జాడేది..

## వెల్ది, లక్ష్మీపూర్ రహదారిపై పడ్డ విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు



**మానకొండూర్, ప్రభాతవార్త :** ఇటీవల భారీ వర్షం, గాలి బీభత్సవానికి మానకొండూరు మండలంలో వెల్ది, లక్ష్మీపూర్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పై విద్యుత్ స్తంభాలు, భారీ చెట్లు విరిగి నేలమట్టమై నాలుగు రోజులు గడుస్తుంది. నాలుగు రోజులుగా పలు గ్రామాల ప్రజలకు రవాణా, ఆర్టీసీ బస్సు సేవలు నిలిపివేయడంతో ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న సంబంధిత ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజుల తర్వాత సమాచారం తెలుసుకున్న ఆర్ అండ్ బి అధికారులు శుక్రవారం మధ్యాహ్నం వారి సిబ్బంది వెల్ది, లక్ష్మీపూర్ గ్రామ సరిహద్దులోని రహదారిపై పడ్డ విద్యుత్ స్తంభాలు భారీ చెట్లను చూసి సమస్య చాలా పెద్దదిగా ఉందని ఇది మాతో కాదు అంటూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వచ్చిన సిబ్బంది వెనుతిరిగి వెళ్లిపోయారు. ప్రభాతవార్త దినపత్రికలో ఇది ఎవరి బాధ్యత..? వచ్చిన కథనంతో మండల అధికారుల దృష్టికి ప్రజల సమస్యలపై తీసుకువెళ్లి నప్పటికీ మండల అధికారులు స్పందించకపోవడం పట్ల పలు గ్రామాల ప్రజలు పలు విమర్శలు చేస్తున్నారు. ప్రధాన రహదారిపై భారీ చెట్లు విద్యుత్ స్తంభాలు పడి నాలుగు రోజులు గడుస్తున్న సమస్యను పరిష్క రించవలసిన సంబంధిత మండల అధికారులు, ఆర్ అండ్ బి అధికారులు, పలు గ్రామాల ప్రజాప్రతినిధులు మండలంలో ఉన్నట్లా..? లేనట్లా..? ఉంటే ప్రజా సమస్యలపై ఎందుకు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే స్పందించి పలు గ్రామాల ప్రజల సమస్యను పరిష్కరించే విధంగా తగు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండల అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# ఉల్లంపల్లి తారు రోడ్డుకు తొలగని గ్రహణం

**చిగురుమామిడి, ప్రభాత వార్త :**

చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామం గత ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన సుందరగిరి నుండి ఉల్లంపల్లి వరకు తారు రోడ్డు ఎట్టకేలకు మంజూరుతో బాటు రోడ్డు పని కూడా పూర్తి కాబడింది. కానీ పూర్తి స్థాయిలో కాకుండా కొంత మేరకు తారు వేయకుండా వదిలి వేసిన విషయం పై ఇరు గ్రామాల ప్రజలు రక రకాలుగా చర్చలు చేసుకుంటున్నారు. అసలు రోడ్డు పూర్తిగా వేయకుండా, కొంత మేరకే వేసి మిగిలిన భాగం ఎందుకు వదిలి వేసినట్టు? బడ్జెట్ సరిపోలేదనా లేక మరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అని ప్రజలు అడుగుతున్నారు. ఒక్క ఉల్లంపల్లి రోడ్డు విషయం లోనే ఎందుకు ఇలా జరుగుతుందని, ప్రతిసారి ఏదో కారణం చెప్పి రోడ్డు పనులు ఆపడం పాలకులకు ? అలవాటుగా మారిందని పలువురు అంటున్నారు. ఈ సమస్యపై ఇరు గ్రామాల సర్పంచ్ లు, పాలకవర్గం, సంబంధిత అధికారులతో కలిసి వెంటనే పూర్తి స్థాయిలో తారు రోడ్డు వేసే విధంగా ప్రయత్నాలు చేయాలని ఉల్లంపల్లి, సుందరగిరి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. తారు వేయకుండా మిగిలిన భాగం రోడ్డు వర్షాకాలం ఆరంభం అయితే గత కష్టాలు మళ్ళీ పునరావృత్తం అవుతాయని ముఖ్యంగా విద్యార్థులు అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత ప్రజా ప్రతినిధులు కూడా చొరవ తీసుకొని మొత్తం తారు రోడ్డును పూర్తి చేయాలని కోరుతున్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జా చేస్తున్నా పట్టించుకోని అధికారులు..!

## వరద కాలువ భూమి కబ్జా పై ఆర్డీవో కు పిర్యాదు..!

**మెట్‌పల్లి,ప్రభాతవార్త:** మండలంలోని ఆత్మనగర్ రామలచ్చక్క పేట శివారులో ఉన్న వరద కాలువ కు చెందిన మొరం అక్రమ రవాణా,ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నా సంబంధిత అధికారులు మాత్రం నిద్ర మత్తులో ఉండటంతో.. ఆత్మనగర్ గ్రామస్తులు శుక్రవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో,ఎస్ఆర్ ఎస్పి ఈఈ సురేష్ కు పిర్యాదు చేశారు.ఈసందర్భంగా ఆత్మనగర్ గ్రామస్తులు మాట్లాడుతూ.. రామ లచ్చక్కపేటకు చెందిన ఓ వ్యక్తి వరద కాలువ భూమిలో నుండి మొరం అక్రమంగా తరలించి, సదరు భూమిని తన స్వంత భూమిలో కలుపుకొనే ప్రయత్నం చేసాడని.. సదరు వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకుని, ప్రభుత్వ భూమిని కాపాడాలని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈవిషయమై వరద కాలువ ఈఈ సురేష్ ను ప్రభాతవార్త వివరణ కోరగా.. ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడినా,అక్రమంగా మొరం తరలించినా రెవిన్యూ అధికారులకు తెలిపి చట్టపరమైన చర్యలు తీసు కుంటామని అన్నారు. కాగా..వరద కాలువ భూమి నుండి అక్రమంగా మొరం తరలించి భూమి చదును చేసే ప్రయత్నంలో వరద కాలువ అధికారులకు పిర్యాదు చేసినా..వారు ఘటనా స్థలానికి వచ్చి.. చదును చేస్తున్న యంత్రాలను వదిలి పెట్టారని వినికిడి.

# మెట్‌పల్లి వార్త

# అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## మెట్ పల్లి సిఐ సురేష్ బాబు

## వెండి బంగారు వర్తక సంఘం ఆధ్వర్యంలో సి ఐ కి సన్మానం.



**మెట్‌పల్లి డివిజన్,ప్రభాతవార్త:** మెటుపల్లి సర్కిల్ పరిధిలో స్వర్ణకారులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మెటుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సురేష్ బాబు అన్నారు.ఇటీవల మెటుపల్లి సిఐ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు ను పట్టణంలోని సిఐ కార్యాలయంలో మెటుపల్లి వెండి బంగారు వర్తక సంఘం అధ్యక్షులు బిజ్జారపు నవీన్ ఆధ్వర్యంలో సిఐ ని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా సిఐ మాట్లాడుతూ..స్వర్ణకార దుకాణాలకు అపరిచిత వ్యక్తులు వస్తే అప్రమత్తంగా ఉండాలని, అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వెండి బంగారు వర్తక సంఘం కార్యదర్శి తిప్పర్తి వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులు గాలిపెళ్ళి నాగరాజు,కోశాధికారి ఐల్లేందుల ఉదయ్,కార్యవర్గ సభ్యులు నాంపల్లి పవన్ కుమార్,తుమ్మనపల్లి మారుతి,ఇల్లేందుల నరేష్,తదితరులు పాల్గొన్నారు.

# అధిక ధరలకు ఎరువులు విక్రహిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిక

## ఎల్ యం డి ఎస్సై అన్వర్..



**తిమ్మాపూర్, ప్రభాత వార్త :** వ్యవసాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని ఎనిమిదవ డివిజన్ అలుగునూర్ లో గల సీ ఎస్ సీ సొసైటీ, శ్రీరామ రైతు డిపో ఎరువుల దుకాణములను ఎస్సై అన్వర్, యం,ఏ. ఓ లు సం యుక్తంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు యం ఆర్పీ రేటుకంటే అధిక ధరలకు ఎరువులను విక్రహించడం తో పాటుగా ఇతర కాంప్లెక్స్ ఎరువులను లింక్ పెట్టి అమ్మిన ఎరువుల దుకాణం లైసెన్స్ రద్దు, యూరియా,డి ఏ పి కాంప్లెక్స్ ఎరువులు ఇతర అవసరాలకు మళ్ళించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ ఓ మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం సీజన్ లో రైతులకు యూరియా, డి ఏ పి ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంటాయని రైతులు ఎవ్వరు అధైర్య పడవద్దని సూచించారు.

# జూన్ I నుండి కళాశాలలు ప్రారంభం

**నార్కట్ పల్లి ప్రభాతవార్త మే 29**

మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయ పరిధిలోని పీజీ కళాశాలలు జూన్ 1 నుండి ప్రారంభం కానున్నట్లు ఎంజియూ రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి తెలిపారు. మే నెల వేసవి సెలవులు ప్రకటించిన దృశ్య జూన్ 1 నుండి తరగతులు ప్రారంభం కానున్నట్లు ఆయన తెలిపారు. కళాశాలలు ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలని, 75 హాజరు నియమాన్ని విధిగా పాటించాలని ఆయన అన్నారు.

# రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

**సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :**

జిల్లాలో జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు . రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్ల పై జిల్లా ఎస్పీ మహేష్ బి గితే, సంబంధిత అధికారులతో శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు పరేడ్ గ్రౌండ్ లో జరుగుతాయని, జిల్లాలోని ప్రతి శాఖకు చెందిన అధికారులు , సిబ్బంది వేడుకలకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. వేడుకలకు సంబంధించి జెండా ఏర్పాట్లు, గ్రౌండ్ సిద్ధం చేయడం మొదలగు ఏర్పాట్లు పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర అవతరణ వేడుకల డయాస్, సీటింగ్ ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వేడుకల వద్ద వైద్య బృందాలచే వైద్య శిబిరాలు ఏర్పాటు



చేయాలని. వేడుకలకు ఆహ్వాన పత్రాలు ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికీ అందాలని ఆదేశించారు.సిరిసిల్ల పట్టణంలోని స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు హాజరయ్యేలా మెప్మా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్య అతిథి అందించే సందేశం రూపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాల వివరాలను క్లుప్తంగా తయారు చేయాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ముఖ్య అతిథి గౌరవ వందనం, ఇతర బందోబస్తు ఏర్పాటు పకడ్బందిగా చేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, కలెక్టరేట్ ఏఓ రామ్ రెడ్డి, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

### సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

**సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 236 కొనుగోలు కేంద్రాలలో మిగిలిన ఒక్క లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తక్షణమే ప్రభుత్వం కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని సిపిఐ మాజీ గుంటి వేణు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుంటి వేణు మాట్లాడుతూ ఈ సీజన్ లో ఆరుగాలం పండించిన పంటలు కొనుగోలు కేంద్రంలోకి వచ్చిన తర్వాత తేమ పేరుమీద దాదాపుగా రెండు నెలల కాలం కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యంతో పాటు రైతులు కూడా కొనుగోలు కేంద్రాలలోనే అనేక అవస్థలు పడుతూ కాలం వెలదీస్తున్నారన్నారు. ప్రభుత్వము చెపుతున్నంత సులభంగా రైస్ మిల్లు యజమానులు రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేయడం లేదు అన్నారు. రైస్ మిల్లు యజమానులు ప్రభుత్వ అధికారులు కుమ్మక్కై ఒక్కొక్క క్వింటాలుకు రెండు నుంచి ఐదు కిలోల ధాన్యాన్ని అదనంగా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. రైతులు ఎంతో ఆశ తోటి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొస్తే సరైన సమయంలో కొనుగోలు కేంద్రాల నుంచి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసినట్లయితే వర్షాల ప్రభావము ధాన్య మీద రైతుల మీద ఉండేది కాదన్నారు. లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని వర్షం కొట్టి తడిసిన గాని ప్రతి గింజను కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందే ఏమాత్రం కొర్రీలు పెడితే రైతాంగము ఉద్యమ పందాలు ఎంచుకోవాల్సి వస్తుందన్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కొనుగోలు చేయలేకపోవడం మూలంగా జిల్లాలో ఎక్కడికక్కడ రైతాంగము ఆందోళనలు ధర్నాలు చేస్తున్న విషయాన్ని ప్రభుత్వం మర్చిపోకూడదని అన్నారు. రైతాంగం ఎదుర్కొంటున్న ఈ సమస్యలను వెంటనే పరిష్కారం చేసి తక్షణమే కొనుగోలు కేంద్రంలో మిగివున్న లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



# సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ విప్‌ను కలిసిన వివోఏలు

**ఎల్లారెడ్డి పేట మే 29 ప్రభాత వార్త**

ఐకేపీ వ్యవస్థలో పనిచేస్తున్న వివోఏ ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని ప్రభుత్వ విప్పు వేములవాడ నియోజకవర్గ శాసనసభ సభ్యులు ఆది శ్రీనివాస్‌కు వారు సమగ్ర మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వివోఏలు ఎదుర్కొంటున్న ఉద్యోగ భద్రత, సిబివో హెచ్ఆర్ పాలసీ అమలు, గౌరవప్రదమైన వేతనం, సంక్షేమ పథకాల కల్పన, సేవా నియమాల రూపకల్పన తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారువిన్నపని స్వీకరించిన ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారు, వివోఏ ల సమస్యలను సానుకూలంగా పరిశీలించి, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు...వివోఏ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కొనసాగుతున్న ఈ ఉద్యమానికి ప్రజాప్రతినిధుల మద్దతు లభించడం సానుకూల పరిణామంగా భావిస్తున్నారు...తమ పట్ల ప్రభుత్వపరంగా సానుకూల



నిర్ణయం వచ్చే విధంగా కృషి చేయాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు విజ్ఞప్తి చేశారు ఎల్లారెడ్డిపేట. వివో ఏ సంఘాల అధ్యక్షులు కొప్పుల రమ సుధారాణి పద్మ జోష్ణ. శ్రీనివాస్ ఆడపు శోభ. మంజుల ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాసును కల్పించిన సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య . వారి వెంట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి, డైరెక్టర్ మెండే శ్రీనివాస్, అనవేని రవి తదితరులున్నారు

# అటవీ అధికారులను అడ్డుకున్న గ్రామస్తులు

### ప్లానిటేషన్ నిర్వహిస్తే ఆత్మహత్యలే శరణ్యం

**గంభీరావుపేట, ప్రభాతవార్త:**



గంభీరావుపేట మండలం రాజేశ్వరరావు నగర్ గ్రామ సమీపంలోని అటవీ భూమిలో ప్లానిటేషన్ కై వెళ్లిన అటవీ శాఖ అధికారులను గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. మొక్కలు పెంచే క్రమంలో జెసిబి తో భూమిని చదును చేసేందుకై ఫారెస్ట్ అధికారి అంజలితో పాటు సిబ్బంది వెళ్ళగా, గ్రామస్తులు అడ్డుపడి అధికారులతో వాగ్వివాదానికి దిగారు. 30 ఏళ్లుగా ఈ ప్రాంత పోడు భూములకు పట్టాలు ఉండి, బోర్లు, బావులు తవ్వుకొని పంటలు పండించుకుంటున్నట్లు అట్టి భూములలో ప్లానిటేషన్ ఎలా నిర్వహిస్తారని అధికారులను నిలదీశారు. పట్టాలున్న భూములలో ప్లానిటేషన్ నిర్వహిస్తే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్లాంటేషన్ నిర్వహిస్తే తమకు ఆత్మహత్యలే శరణ్యమని పత్తి మందు డబ్బాలతో పలువురు రైతులు అధికారుల సమక్షంలో ఆందోళనకు దిగారు. అధికారుల ప్రయత్నాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో రైతులు బోరు బావులు వేసుకొని విద్యుత్ సౌకర్యం కల్పించుకుని పంటలు సాగు చేసుకుంటున్నామని ఉన్నపలంగా ప్లానిటేషన్ నిర్వహిస్తే రైతుల కుటుంబాలు రోడ్డున పడతాయని గ్రామ సర్పంచ్ పిట్ల బాబు తక్షణము ఫోన్ ద్వారా జిల్లా అటవీ శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. ప్లానిటేషన్ ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. రైతులు అడ్డుకోవడంతో ఫారెస్ట్ సిబ్బంది పనులు చేయకుండానే వెనిదిరిగి వెళ్లారు.

## సిరిసిల్ల వార్త



# ధాన్యం తరలింపులో అలసత్వం తగదు

### అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త:**



మండలములో రైతుల నుంచి సేకరించిన వరి ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వాహకులకు సూచించారు.మండలములోని పెద్దలింగాపూర్, దాచారం, చిక్కుడువానిపల్లె కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు.కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి సంబంధించి ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకు వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి తరలించాలని, రైతులకు క్షేత్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.ఒక వేళ వర్షం కారణంగా తడిసిన ధాన్యం విషయంలోరైతులు అధైర్యపడకుండా ధాన్యం సేకరిస్తామని భరోసా కల్పించారు.తూకం వేసిన ధాన్యం లోడింగ్ చేయడం కోసం హమాలీల సంఖ్య పెంచుకుని కొనుగోళ్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాచకట్ల సురేష్,ఏ పి ఎం కుమారస్వామి, నిర్వాహకులు,రైతులు ఉన్నారు.

# పత్తికుంటపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త:**



మండలంలోని పత్తికుంటపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ జుట్టు శేఖర్ శుక్రవారం ప్రారంభించారు.సుమారు రూ.5 లక్షల అంచనా వ్యయంతో ఈ సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు.గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగానే ఈ పనులు చేపడుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీపీ గుడిసె ఐలయ్య, నాయకులు సంజీవ్,మనోహర్ రెడ్డి, ఏఈ రాజేష్,వార్డు సభ్యులు,భారతి,పూజ,రాజమణి,భాస్కర్,శ్రీనివాస్ రెడ్డి, వెంకట్, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

# మోకాళ్లపై వివోఏల నిరసన

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త:**

తమ డిమాండ్ల సాధన కోసం నిరవధిక నిరసన తెలుపుతున్న వివో ఏలు శుక్రవారం వినూతనంగా నిరసన చేపట్టారు.మండల పరిషత్ ఆవరణలో దాదాపు 11రోజుల నుండి నిరసన,చేపట్టగ శుక్రవారం మోకాళ్ళపై ఉండి తమ భాధను వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని వారు కోరారు.చాలీ చాలని గౌరవ వేతనముతో పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



# బహిరంగ చర్చను అడ్డుకున్న పోలీసులు అంటూ కాంగ్రెస్ సేవాదళ్ ఆగ్రహం

### శ్రావణి అవినీతిపై పోరాటం కొనసాగిస్తాం

### కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముఖేష్ కన్నా

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త**

కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ముఖేష్ కన్నాను శుక్రవారం పోలీసులు గృహనిర్బంధం చేశారు. కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహిరంగ చర్చ కార్యక్రమానికి తరలి వెళ్తున్న కార్యకర్తలను కూడా పోలీసులు అడ్డుకుని గృహనిర్బంధం చేసినట్లు నాయకులు ఆరోపించారు. ఈ సందర్భంగా ముఖేష్ కన్నా మాట్లాడుతూ బీజేపీ జగిత్యాల ఇన్‌చార్జిగా చెప్పుకుంటున్న భోగ శ్రావణి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు చేస్తుండటంతో కాంగ్రెస్ సేవాదళ్ తరఫున బహిరంగ చర్చకు ఆహ్వానించామని తెలిపారు. పాత్రికేయుల సమక్షంలోనే చర్చకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించినప్పటికీ, భోగ శ్రావణి ధైర్యం లేక రాత్రి సమయంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి స్టిక్కర్లు వేయించడం వారి పిరికితనానికి నిదర్శనమని విమర్శించారు. అలాగే



స్టిక్కర్లపై బీజేపీ పేరు ప్రస్తావించకుండా"జగిత్యాల ప్రజలు" పేరుతో ప్రచారం చేయడం ద్వారా తమ అవినీతి బయటపడుతుందనే భయంతో ఇలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. భోగ శ్రావణి అవినీతిపై ఖచ్చితంగా పోరాటం కొనసాగిస్తామని, ప్రజాక్షేత్రంలో ఆమె అవినీతిని ఎండగడతామని ముఖేష్ కన్నా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజేందర్, నాగభూషణం, గంగాధర్, జగదీష్, వినోద్, మహేష్ కుమార్, ప్రతాప్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఫెర్టిలైజర్ షాపుల్లో రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ శాఖల జాయింట్ రైడ్స్

### నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు : అధికారుల హెచ్చరిక

**బీర్ పూర్ ప్రభాత వార్త**

జగిత్యాల జిల్లా బీర్ పూర్ మండల కేంద్రంలో వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు టాస్క్ ఫోర్స్ బృందంగా ఏర్పడి శుక్రవారం స్థానిక ఫెర్టిలైజర్ (ఎరువుల) దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాక్ మరియు రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం దుకాణాల నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు. బిల్లులు లేని విత్తనాలు, రసాయనాలు, ఎరువులను ఎట్టిపరిస్థితుల్లోనూ విక్రయించకూడదని హెచ్చరించారు. రైతులు ఏ వస్తువు కొనుగోలు చేసినా వారికి తప్పనిసరిగా రశీదులు (బిల్లులు) ఇవ్వాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం నిషేధించిన, కలుపు మందులను తట్టుకునే



(హెచ్. టీ) పత్తి విత్తనాలను అమ్మితే చట్టపరమైన చర్యలు ఉంటాయని తేల్చి చెప్పారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో మండల తహశీల్దార్ సుజాత, మండల వ్యవసాయ అధికారి తిరుపతి, ఏఈఓ వినోద్, మరియు పోలీస్ సిబ్బంది భరత్, సంయుక్తంగా పాల్గొన్నారు. ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్ లత

**రాయికల్ ప్రభాతవార్త:**



శుక్రవారం రాయికల్ మండలం మైతాపూర్ గ్రామం లోని ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రం మరియు రాయికల్ మండలం లోని శివమని రైస్ మిల్లును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీమతి బి.ఎస్. లత ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియను ప్రత్యక్షంగా పరిశీలించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా కొనుగోలు ప్రక్రియను కొనసాగించాలని అధికారులకు సూచించారు. కేంద్రాలలో హమలీలు తగిన సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ధాన్యం లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేసి లారీలను ఆలస్యం లేకుండా మిల్లులకు తరలించాలని ఆదేశించారు. అలాగే ట్రక్ షీట్ నమోదు, ట్యాబ్ ఎంట్రీలు వంటి అన్ని డాక్యుమెంటేషన్ పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని స్పష్టం చేశారు. కొనుగోలు కేంద్రాలలో పారదర్శకత పాటించడంతో పాటు రైతులకు సరైన సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోలు సమయంలో తేమ శాతం, నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పరిశీలించాలని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను హెచ్చరించారు. అనంతరం రైస్ మిల్లులను తనిఖీ చేసి మిల్లర్లు హమాలీల సంఖ్య పెంచాలని ధాన్యం తో వచ్చిన లారీలను 24 గంటల్లోగా అన్లోడ్ అయ్యే విధంగా చూడాలని రైస్ మిల్లర్లు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ధాన్యం కొనుగోళ్లు సజావుగా, వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ధాన్యం అన్లోడింగ్ లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, నాయబ్ తహసీల్దార్ , సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది, కేంద్రల నిర్వాహకులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాల విక్రయిస్తే కఠిన చర్యలు

### మండల వ్యవసాయ అధికారిణి పి. జ్యోతి

**కొడిమ్యాల, ప్రభాతవార్త:**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంతో పాటు పూడూరు, నమిలికొండ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారిణి పి. జ్యోతి విత్తన, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులను పరిశీలించారు. రైతులకు అవసరమైన వరి సన్న రకాల విత్తనాలు అందుబాటులో ఉంచాలని డీలర్లకు సూచించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులు, ధరల పట్టికలు తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. రైతులకు విక్రయాల సమయంలో బిల్లులు, రసీదులు ఇవ్వాలని సూచిస్తూ, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నకిలీ విత్తనాలు లేదా అనుమతి లేని విత్తనాల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, విత్తన చట్టం ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి స్పష్టం చేశారు.

# పదవీ విరమణ సన్మానం

**జగిత్యాల టౌన్ ప్రభాతవార్త:**

కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో సంస్థ ప్రధాన అడ్మిన్, ఉపాధ్యా యురాలు, కవయిత్రి మద్దెల సరోజన గంగారాం పదవి విరమణ కార్యక్రమం స్థానిక దేవిశ్రీ గార్డెన్స్ లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉద్యోగ పర్వములో పదవీ విరమణ తప్పదని శేష జీవితం ఆనందంగా, సమాజ హితంగా జీవించాలని పి ఆర్ టి యూ జిల్లా అధ్యక్షుడు బి. ఆనందరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో టి. వి. సూర్యం, ఉపాధ్యాయ సంఘ నాయకులు అమర్నాథ్ రెడ్డి, అలిశెట్టి రాజు, భోనగిరి దేవయ్య, కవయిత్రులు అయిత అనిత, కటుకం కవిత, లక్కరాజు శ్రీలక్ష్మీ ్ర, రుద్రాంగి కమల, మద్దెల ప్రభాకర్, రుద్రాంగి గోపాలకృష్ణ, సరళ, గెటప్ శ్రీనివాస్ చారి పాల్గొన్నారు.



# జగిత్యాల వార్త



# సేవ చేయడానికి లయన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక

### లయన్స్ క్లబ్ జిందా గవర్నర్ లయన్ సింహరాజు, కోదండ రాములు

**రాయికల్ ప్రభాతవార్త:**



సేవ చేయడానికి లైన్స్ క్లబ్ ఒక చక్కని వేదిక అని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ లయన్ సింహరాజు కోదండరాములు గారు అన్నారు. శుక్రవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రాయికల్ వారి ఆధ్వర్యంలో దాతలు ఎనగంటి రాములు తంగెళ్ల రమేష్‌ల సహకారంతో రెండు నూతన బాడీ ఫ్రీజర్స్ ను ఓపెనింగ్ చేయడం జరిగింది ఇట్టి కార్యక్రమాన్ని నఉద్దేశించి సింహరాజు కోదండరాములు గారు మాట్లాడుతూ ఇంక మరెన్నో సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని అన్నారు. మరియు నూతనంగా ఎన్నికైన స్థానిక మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లను మరియు కోఆప్షన్ మెంబర్స్ ను ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు కొత్తపెల్లి రంజిత్ కుమార్ ప్రధాన కార్యదర్శి బొడుగం అంజి రెడ్డి కోశాధికారి బెక్కం తిరుపతి జిల్లా కోఆర్డినేటర్ రమేష్ డిసిలు బత్తిని భూమయ్య, మేకల రమేష్ గారు కాటిపల్లి రాంరెడ్డి గారు రాయికల్ మున్సిపల్ చైర్మన్ కటకం రవి వైస్ చైర్మన్ సౌజన్య శ్రీధర్ రెడ్డి గారు స్థానిక కౌన్సిలర్లు కోఆప్షన్ మెంబర్లు లయన్స్ క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్, దాసరి గంగాధర్, ఆది రెడ్డి గంప ఆనందం వాసం ప్రసాద్ బొమ్మ కంటి నవీన్ సుధ వేణి మురళి కురుమ సుదర్శన్ రెడ్డి కొయ్యడి మైపాల్ రెడ్డి గంట్యాల ప్రవీణ్ కనపర్తి శ్రీనివాస్ వాసం స్వామి సామల లక్ష్మీ ్మనారాయణ గారు ఆడెపు రాంప్రసాద్, ఎర్ర సుమన్, జిల్లాల సూర్యం రెడ్డి, సాంబారు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

### జూన్ 30లోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### అడిషనల్ కమిషనర్ రవీంధర్

**కొడిమ్యాల, ప్రభాతవార్త:**



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని అడిషనల్ కమిషనర్ రవీందర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని నాచుపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులను పరిశీలించి పనుల నాణ్యత, పురోగతిపై అధికారులకు సూచనలు చేశారు. అనంతరం పూడూరు గ్రామంలో మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న మురుగు నీటి కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలైన అంగన్‌వాడీ భవనాలు, వీఓ భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, పాఠశాల మరుగుదొడ్లు తదితర పనులను నిర్ణీత గడువైన జూన్ 30లోపు పూర్తి చేయాలని సంబంధిత ఏఈ (పీఆర్) అధికారులకు ఆదేశించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు త్వరితగతిన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ గౌతమ్ రెడ్డి, డీఆర్‌డీఓ పిడి రఘువరన్, డీపీవో మదన్, ఎంపీడీవో స్వరూప, ఎంపీఓ, ఏఈ పీఆర్, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ సమస్యలను పరిష్కరించండి..

## జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే కౌశిక్ వినతి పత్రం..

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:*

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్, ఇల్లందకుంట మండలాల పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న చిరకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రాను కలిసి సుదీర్ఘమైన వినతి పత్రాన్ని సమర్పించారు. హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలలో నెలకొని ఉన్న తీవ్రమైన మంచినీటి ఎద్దడిని అత్యవసర సమస్యగా పరిగణలోకి తీసుకుని నీటి ఎద్దటిని నివారించాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇల్లందకుంట, కమలాపూర్, వీణవంక మండలాల పరిధిలోని గ్రామాలలో తాగునీటి కోసం



ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి కలెక్టర్ చిత్రమిశ్రా దృష్టికి తీసుకవచ్చారు. నాడు తెలంగాణ రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హుజురాబాద్ నియోజకవర్గంలో అమలు చేసిన దళితబంధు పథకం రెండోవ విడుత నిధులను త్వరితగతిన విడుదల చేసి అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి చేసారు. దళితుల కుటుంబాలలో అర్హులైన పేదలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడిందని, కొన్ని విజయవంతమైన యూనిట్లను కలెక్టర్ ముందు ఉంచారు. నియోజకవర్గంలో అభివృద్ధికి కీలకమైన వీణవంక మండల కేంద్రంలోని డబుల్ రోడ్డు నిర్మాణం, రాచపల్లి, పోతిరెడ్డిపల్లి, కోర్కల్, నాగంపేట రోడ్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసారు. ఈ గ్రామాలలో రోడ్ల దుస్థితి దయనీయంగా ఉండడంతో ఆ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే వివరించారు. హుజురాబాద్ నియోజకవర్గంలో రైతులు ఆరుగాలం కష్టించి పండించిన మక్కజొన్న పంట కొనుగోళ్లలో మార్క్‌ఫెడ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు అనేక ఇక్కట్లకు గురవుతున్నారని, రోజుల తరబడి మార్కెట్‌లో ఉండిపోవల్సి వస్తుందని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి తన వినతి పత్రంలో పేర్కొన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూం ఇండ్లను అర్హులైన పేదలకు పారదర్శకంగా అందించాలని రాజకీయ ఒత్తిళ్లకు అవకాశం ఇవ్వకూడదని, రాజకీయ పార్టీలకు అతీతంగా పేద ఎంపిక జరగాలని ఆయన తన వినతి పత్రంలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో గతంలో మంజూరు చేసిన నిధులు పలు అభివృద్ధి పనులకు అందకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బిఆర్ఎస్ సీనియర్ నాయకులు పేరాల సంపత్‌రావు, సరిగొమ్ముల వెంకటేష్, తోట లక్ష్మణ్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

## -- పిడి స్వరూప రాణి

*హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:*

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని మెప్మా పిడి స్వరూప రాణి అన్నారు. శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని వివిఆర్ ఫంక్షన్ హాల్ లో ప్రజా పాలనలో మహిళా వారోత్సవాల్లో భాగంగా హుజురాబాద్ పట్టణ సమాఖ్య ఆధ్వర్యములో సర్వ సభ్య సమావేశము జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు రుణాలు పొందడం ద్వారా ఆర్థిక స్వావలంబన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ రొంటల సుహాసిని మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. అనంతరం మహిళా సంఘాలకు రుణాల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రావణ్ కుమార్, డిఎంసి శ్రీవాణి, కౌన్సిలర్లు సొల్లు సునీత, ఇల్లందుల సమ్మయ్య, జున్నోజు భాస్కర్, వజ్జేపల్లి వెంకటేశ్వర్లు, మాహమ్మద్ ఖాలిక్, గోస్కుల రాజ్ కుమార్, నాంపెల్లి శ్రీనివాస్, తాళ్ళపెల్లి రమేష్ గౌడ్, బొరగాల మొగిలి, మెప్మా టిఎంసి మల్లేశ్వరి, ఎసిడిపిఓ, యుబిఐ మేనేజర్, స్రీనిధి ఆర్ఎం మాదార్, మేనేజర్ అనిల్, టిఎల్ఎఫ్ ఓబిలు స్రవంతి, కల్యాణి, నజియా, సిఎల్ఆర్పి రమాదేవి, స్వరూప, టిఎల్ఎఫ్ ఆర్పీ, ఓబి లు, ఆర్పి లు పాల్గొన్నారు.



# ఉద్యోగుల తొలగింపులు ఆపాలి

## బీఎంఎస్ నేతల డిమాండ్

*కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:*

రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యాసంస్థల్లో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులను తొలగించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని భారత్ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల నాన్ టీచింగ్ స్టాఫ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమావేశం శుక్రవారం నగరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఎంఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్



మాట్లాడుతూ 2017 నుంచి స్వీపింగ్, హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, శానిటేషన్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించి కాంట్రాక్టర్లకు టెండర్లు ఇవ్వడం అన్యాయమన్నారు. గురుకుల విద్యాసంస్థలు సక్రమంగా నడవడంలో నాన్ టీచింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వారిని ఒక్కసారిగా విధుల నుంచి తొలగించడం వల్ల వారి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పప్పుల సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం ఒకవైపు ఉద్యోగాల కల్పన గురించి మాట్లాడుతూనే, మరోవైపు ఇప్పటికే పనిచేస్తున్న కార్మికులను తొలగించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటి హక్కులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొలగింపుల నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ కార్యదర్శి తొర్తి శ్రీనివాస్, మెండే శివశంకర్, అంజన్న, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థాన డైరెక్టర్ రాజన్నకు ఘన సన్మానం

*హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:*



శ్రీ కాళేశ్వర దేవాలయం కమిటి డైరెక్టర్ గా నియమితులైన తాటిపెల్లి రాజన్నను శుక్రవారం హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో వాకర్స్ ఘనంగా సన్మానించారు. మరెన్నో ఉన్నత పదవులు రాజన్న అదిష్టించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, వేల్పుల రత్నం, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు హరి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఎండి. మతిన్ తదితరులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లు పెంచాలి

## బడిబాట సమర్థవంతంగా నిర్వహించాలి కలెక్టర్ చిత్రా మిశ్రా

*కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:*

బడిబాట కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థల్లో అడ్మిషన్లను పెంచాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాలు, సంక్షేమ హాస్టళ్ల తదితర విభాగాల ఉన్నతాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో



కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 20 వరకు జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించి అన్ని విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న విద్యాసంస్థల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమైన మరమ్మతులు చేయించాలని అన్నారు. అన్ని పాఠశాలలు, హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని, మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులకు అపాయం సంభవించకుండా సరైన రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉండే పాఠశాలలు, హాస్టళ్లలో ఎక్కువ మంది సిబ్బంది, ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్ల ప్రారంభమయ్యేలోగా కామన్ డైట్ మెనూకు అవసరమైన సరుకుల టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ నియమ నిబంధనలు అనుసరించి నాణ్యమైన సరుకులకు టెండర్లు నిర్వహించాలని అన్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్, పుస్తకాలు తదితర మెటీరియల్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ సంక్షేమ శాఖ డిడి తిరుపతిరావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, ఆర్.సి.ఓ అంజలి, విద్యాశాఖ ఏడి మాధవి, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో నాగు పాము హల్చల్

*హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:*

హుజురాబాద్ మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం నాగుపాము హల్చల్ చేసింది. కార్యాలయం పనివేళలు ప్రారంభం కావడంతో అందరూ కార్యాలయానికి వచ్చారు. ఇదే సమయంలో ఒక నాగుపాము కార్యాలయంలోకి వచ్చింది. పాములు చూసిన అధికారులు, ప్రజలు ఒక్కసారిగా కేకలు వేస్తూ బయటకు వచ్చారు. అది నేరుగా తహశీల్దార్ కార్యాలయ ఛాంబర్ లోకి వెళ్ళింది. దీంతో కార్యాలయ సిబ్బంది పాములు పట్టే వ్యక్తిని పిలిపించి దానిని పట్టి ఊరవతల వదిలి పెట్టించారు. ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# అంకుల్ కౌశిక్ నమస్తే.... చిన్నారి

## జర అప్పుడప్పుడు దవాఖాన దిక్కు చూడరాదే...

## -- సర్కార్ దవాఖాను సందర్శించిన ఎమ్మెల్యే

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*

కరీంనగర్ జిల్లా హుజురాబాద్ నియోజకవర్గ కేంద్రంగా వంద పడకల ఆసుపత్రిగా పేరున్న ఈ ఆసుపత్రిలో నిత్యం సమస్యలే... అన్ని రాజకీయ పార్టీల నేతలు ఆసుపత్రిని సందర్శిస్తూనే ఉంటారు... కానీ సమస్యలు మాత్రం యాధాతదంగానే మిగిలిపోతాయి. అందులో భాగంగానే శుక్రవారం బిఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి కౌశిక్ రెడ్డి కరీంనగర్ జిల్లా కేడిసిసి వైస్ చైర్మన్ పింగిళి రమేష్, హుజురాబాద్ మున్సిపల్ మాజీ చైర్మన్ గందె రాధిక శ్రీనివాస్ హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. పలు వార్డులలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆరా తీశారు. చిల్డ్రెన్స్ వార్డులోకి వెళ్ళినప్పుడు 4 సంవత్సరాల చిన్నారి అంకుల్ కౌశిక్ నమస్తే.... అంటూ నమస్కారం చేయడం అక్కడ అందరిని ఆశ్చర్యంలో ముంచేత్తింది. ఆ చిన్నారి తల్లి ఆసుపత్రిలో డెలివరీ కాగా వాళ్ళ అమ్మమ్మతో ఆసుపత్రిలో చిన్నారి ఉండిపోయింది. ఇక్కడికి మీరు ఇక్కడికి ఎప్పటికి రావాలని చిన్నారి అనడం అందరిని ఆలోచింప చేసింది. ఆసుపత్రిలో వార్డులను సందర్శిస్తూ గర్భిణీ స్త్రీలు, డెలివరీ అయిన మహిళలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవలు, పౌష్టికాహారం పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆరా తీశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు డెలివరీ అయిన మహిళలకు ప్రభుత్వ పారితోషికంతో పాటు కేసీఆర్ కిట్టు అందించేవారని, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఆ పథకాన్ని నిలిపివేసిందని, డెలివరీ అయిన మహిళలతో ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలు, మధ్యతరగతి కుటుంబాలే డెలివరీకి వస్తారని, అలాంటి వారికి కేసీఆర్ కిట్టు పథకాన్ని అమలు చేయాలని ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని ఆయన ఆసుపత్రి సూపరిండెంట్ కు విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలో పరిసరాల పరిశుభ్రత అస్తవ్యస్తంగా ఉందని, ఆసుపత్రిలో ఉంటున్న రోగులకు పౌష్టికాహారం అందించాలని, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రోగుల పట్ల, ఇన్‌వార్డు పేషంట్ల పట్ల 24 గంటలు వైద్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన సూచించారు. రేపు రానున్న రోజులు వర్షాకాలం కావడంతో పరిసరాలపై ప్రత్యేక దృష్టిని సారించి ఆసుపత్రిలో ఈగలు, దోమలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల వైద్యుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఆధునిక వైద్య



పరికరాలు అందించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలలో సరిపడా వైద్య సిబ్బంది లేరని, వెంటనే వైద్యులు నియమించాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వెంట పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన బిజిగిర్ షరీఫ్ దర్గా.....

## ఘనంగా సందల్ షరీఫ్...

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త:

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన బిజిగిర్ షరీఫ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి రహమతుల్లాలై,హజ్రత్ సయ్యద్ అజ్మత్ షావలి రహమతుల్లాలై,హజ్రత్ సయ్యద్ అక్బర్ షావలి రహమతుల్లాలై,హజ్రత్ సయ్యద్ ముర్తుజా షావలి రహమతుల్లాలై దర్గాలోని సమాధులకు



వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకోగా శుక్రవారం తెల్లవారుజామున మూడు గంటలకు సంధల్ షరీఫ్ (గ్రంథ లేపణం) ఉత్సవం భక్తిపారవశ్యంతో ఘనంగా జరిగింది.వేలాది మంది భక్తులు ఆనందోత్సాహాలతో ఉత్సవంలో పాల్గొని సంధల్ షరీఫ్ ( గ్రంథ లేపణం) మొల్లాపల్లి,పెద్ద బిజిగీర్ షరీఫ్ నుండి మేళా తాళాల మధ్య దర్గాకు తీసుకొని వచ్చారు. సంధల్ ను దర్గాలోని సమాధులకు అలరింపచేశారు.ముస్లిం మత గురువు మోలానా యాసీన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.దర్గా ముజావర్లు హైదరాబాద్ నుండి తెచ్చిన ప్రత్యేక చాదార్లు దర్గాలోని సమాధులకు సమర్పించారు. భక్తులు క్యూలో నిలబడి దర్గాలోని సమాధులకు దర్శనం చేసుకొని తమ మొక్కులు తీర్చుకున్నారు. కొత్తగూడెం వాస్తవ్యుడు కీర్తిశేషులు గాజి గోవర్ధన్ మిత్రబృందం మూడువేల మంది భక్తులకు అన్నదానం చేశారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హుజురాబాద్ ఏసిపి వి.మాధవి ,జమ్మికుంట పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు.సందల్ షరీఫ్ కార్యక్రమం విజయవంతం కావడంతో దర్గా ముతవల్లి మహమ్మద్ అక్బర్ అలీ, దర్గా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ ఇక్బాల్ కార్యవర్గ సభ్యులు ప్రజలకు పోలీస్ సిబ్బందికి,వైద్య ఆరోగ్య సిబ్బందికి, ఆర్టీసీ అధికారులకు,విద్యుత్ శాఖ అధికారులకు, వక్ఫ బోర్డ్ అధికారులకు,పత్రికా ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

# బిజిగిరిషరీఫ్ దర్గాను దర్శించుకుని..

## ప్రత్యేక ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే కౌశిక్, కాంగ్రెస్ నేత ప్రణవ్..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త;;;

ఉత్తర తెలంగాణ ప్రాంతంలో సర్వమతాలకు ప్రతీకగా 800 సంవత్సరాలుగా ప్రత్యేక ప్రార్థనలు అందుకుంటున్న కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామంలోని హజ్రత్ సయ్యద్ ఇంకూషావలి దర్గాలో ముస్లింల పవిత్ర పర్వదినం బక్రీద్ రోజున ప్రారంభమైన ఉర్సు ఉత్సవాలు అత్యంత భద్రత ఏర్పాట్లపై మధ్య గత నాలుగు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగానే శుక్రవారం హుజురాబాద్ నియోజకవర్గ బిఆర్ఎస్ శాసనసభ్యుడు పాడి



కౌశిక్‌రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఒడితల ప్రణవ్‌లు వేరు వేరుగా వారి వారి అనుచరగణంతో దర్గాను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈ సందర్భంగా దర్గా కమిటీ మత పెద్దలు ఇరువురిని శాలువాలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, కాంగ్రెస్ నేత ఒడితల ప్రణవ్‌లు దర్గా నియమ నిబంధనల ప్రకారంగా చాధర్ తలపై పెట్టుకుని పుష్పాలు, సుగంద ద్రవ్యాలను దర్గాలోని సమాధులపై మత పెద్దలతో కలిసి మొక్కులు అప్పగించి ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌లు ప్రత్యేక ప్రార్థనలు చేసారు. ఈ సందర్భంగా దర్గాను సందర్శించిన ఇరువురు నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో హిందూ, ముస్లింల మత సామరస్యానికి ప్రతీకగా సంవత్సరం పొడవున ఇక్కడ ప్రత్యేక ప్రార్థనలు కొనసాగడం, దర్గాలో మేకపోతులను, గొర్రె పోతులను బలి ఇచ్చి (కందురు) మొక్కులు చెల్లించుకోవడం ఈ దర్గాలోని ప్రత్యేకత అని ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, ప్రణవ్‌లు కొనియాడారు. బిజిగిరిషరీఫ్ దర్గాలో ఇక్కడికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మరిన్ని వసతి సౌకర్యాలు, ప్రత్యేక మౌళిక వసతులు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తామని, ప్రభుత్వ పరంగా నిధులు సమకూరుస్తామని నేతలు అన్నారు. ప్రజల అధ్యాత్మిక విశ్వాసాలు అనుగుణంగా ఈ ప్రాంతాన్ని మరింత తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే కౌశిక్‌రెడి, ఒడితల ప్రణవ్‌లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కెడిసిసి వైస్ చైర్మన్ పింగిలి రమేష్, జమ్మికుంట సింగిల్ విండో చైర్మన్ పొనగంటి సంపత్‌కుమార్, మాజీ వైస్ ఎంపిపి చుక్క రంజీత్, బిఆర్ఎస్ నాయకులు సరిగొమ్ముల వెంకటేష్, కాంగ్రెస్ నేతలు ఎక్కటి సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పర్శురాం రావు, పెద్ది కుమార్, దర్గా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, దర్గా కమిటీ ఉపాధ్యక్షులు మహ్మద్ అబ్దుల్ కరీం, దర్గా కమిటీ నిర్వాహణ అధ్యక్షులు మహ్మద్ తౌఫిక్ హుస్సేన్‌లతో పాటు పలువురు బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# హుజూరాబాద్ వార్త



# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు మౌలిక వసతులు కల్పించాలి

**కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

**గూడూరు, కమలాపూర్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలించిన కలెక్టర్**

కమలాపూర్: ప్రభాత వార్త.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాల్లో పెండింగ్‌లో ఉన్న పనులన్నీ వెంటనే పూర్తి చేసి, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతులను యుద్ధప్రాతిపదికన కల్పించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ కమలాపూర్ మండలంలోని గూడూరు, కమలాపూర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్



బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రతి బ్లాకును క్షుణ్ణంగా తనిఖీ చేసిన కలెక్టర్, ఇళ్ల నిర్మాణ నాణ్యత, మిగిలిపోయిన మరమ్మతు పనులు, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ ఇళ్లను లబ్ధిదారులకు త్వరగా అప్పగించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. చిన్నచిన్న మరమ్మతు పనులు, పెయింటింగ్, తలుపులుకిటికీల బిగింపు వంటి పనుల్లో జాప్యం చేయకుండా వెంటనే పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా లబ్ధిదారులు గృహప్రవేశం చేసేనాటికి తాగునీటి సరఫరా, నిరంతర విద్యుత్, డ్రైనేజీ వ్యవస్థ, అంతర్గత రోడ్లు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండేలా చూడాలని గృహ నిర్మాణ శాఖ, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.పెండింగ్ పనుల పురోగతిపై ప్రతిరోజూ తనకు నివేదిక అందించాలని, కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలన కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ వనజ కళాధర్, కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, డీఆర్డీవో మేన శ్రీను, ఎంపీడీవో బాబు, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీ ఓ చేతన్ రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్, జ్యోతి,తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో అధికారులు పనులు వేగవంతం చేసేందుకు సిద్ధమయ్యారు.

# కమలాపూర్‌లో బి.ఆర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక..

**అంబేద్కర్ బాటలో నడుస్తామన్న అధ్యక్షుడు సురేష్.**

కమలాపూర్: ప్రభాత వార్త.

కమలాపూర్‌లో శుక్రవారం డాక్టర్ బి.ఆర్ యువజన సంఘం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులు బొల్లంపల్లి షఢ్రక్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా గాజుల సురేష్, ప్రధాన కార్యదర్శిగా పుల్ల సురేష్, ఉపాధ్యక్షుడిగా కొలుగూరి రాము, కార్యదర్శిగా మాట్లా మహేశ్వర్, కోశాధికారిగా కొలుగూరి హవీష్‌లతో పాటు 8 మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు గాజుల సురేష్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన జిల్లా నాయకత్వానికి, మండల సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలే తమకు మార్గదర్శకమని, ఆయన చూపిన బాటలోనే నడుస్తూ దళిత, బహుజన యువత హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో యువతను చైతన్యపరిచి, విద్య, ఉపాధి



అవకాశాలపై అవగాహన కల్పిస్తామని తెలిపారు.త్వరలోనే మండలంలోని అన్ని గ్రామాల్లో నూతన శాఖలు ఏర్పాటు చేసి సంఘాన్ని క్షేత్రస్థాయిలో పటిష్టం చేస్తామని అన్నారు. “అంబేద్కర్ సిద్ధాంతాలను గడపగడపకు తీసుకెళ్లడం, యువతలో ఆత్మగౌరవాన్ని నింపడం, సామాజిక అసమానతలపై నిరంతరం గళమెత్తడం మా ప్రధాన లక్ష్యం“ అని గాజుల సురేష్ పేర్కొన్నారు. జిల్లా నాయకత్వం సూచనల మేరకు యువత సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.

# సర్ పై గ్రామ గ్రామాన అవగాహన కల్పిద్దాం

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సర్ పై గ్రామ గ్రామాన అవగాహన కల్పిద్దామని కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ సర్ కో ఆర్డినేటర్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, హుజురాబాద్ నియోజకవర్గం ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు అన్నారు. శుక్రవారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాడవాడల ప్రజలకు అవగాహన కల్పించి ముందుకు వెళ్లాలని, దాని కోసం పోలింగ్ బూత్ ఏజెంట్లు పకడ్బందీగా కృషి చేయాలని అన్నారు. హుజురాబాద్ లో కాంగ్రెస్ పార్టీ బలమైన శక్తిగా ఉందని, దాన్ని అలాగే కొనసాగించాలని, ప్రజాస్వామ్యంలో ఓటు అనేది చాలా ముఖ్యమని, సర్ పేరుతో బిజెపి చేస్తున్న వాటిని ప్రయత్నాలను అడ్డుకోవాలని అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గవ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ బూత్ లలో కాంగ్రెస్ నాయకులు సర్ పై విసృతంగా ప్రచారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్మన్ అంజలి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అగ్ని ప్రమాద సంఘటన స్థలాలను పరిశీలించిన వొడితల ప్రణవ్.

.జమ్మికుంట / హుజూరాబాద్, ప్రభాతవార్త:

ఇటీవల ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయిన ప్రమాద స్థలాలను హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పరిశీలించారు. శుక్రవారం జమ్మికుంట మండల పరిధిలోని తనుగుల, మడిపల్లి, అంకుశాపూర్ గ్రామాలు, కమలాపూర్ మండలంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించారు. ప్రమాదానికి గల కారణాలను అక్కడున్న గౌడ కులస్తులు వివరించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన తెలిసిన వెంటనే అధికారులకు నష్టం అంచనా వేయమని సూచించామని తెలిపారు. రైతులు వరి కొయ్యలను కాల్చి పర్యావరణానికి హాని కలిగించొద్దని విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా కృషి చేయాలని కోరారు. సంఘటన స్థలం నుండి అధికారులకు ఫోన్ చేసి పరిస్థితి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, పట్టణ మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మిల్లర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ కోయ శ్రీహర్ష

ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్ష

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**
మిల్లర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్చరించారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో వరి ధాన్యం కొనుగోళ్లపై జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి కటింగ్ జరగకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా మిల్లర్లు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. నాణ్యత పరిశీలించిన ధాన్ని మాత్రమే రైస్ మిల్లులకు తరలించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ కటింగ్



చేయవద్దని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన 100 శాతం ట్యాబ్ ఎంట్రీలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జూన్ 2 నాటికి అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి కేంద్రాలను మూసివేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీవో కలిందిని, డీసీవో శ్రీమాల, ఏపీఎంలు, ఏపీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పూర్తిస్థాయిలో ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి పనులపై సమీక్ష



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: జిల్లాకు ఉపాధి హామీ పథకం క్రింద మంజూరైన మెటీరియల్ కాంపోనెంట్ నిధులను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్ శాఖ అభివృద్ధి పనుల పురోగతిపై లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కో య శ్రీ హర్ష మాట్లాడుతూ, జూన్ రెండవ వారం నాటికి ఉపాధి హామీ పథకం క్రింద మంజూరైన నిధుల వినియోగం పూర్తి కావాలని తెలిపారు. జూన్ చివరి వరకు మంజూరైన ఉపాధి హామీ పనులను ప్రత్యేక శ్రద్ధతో గ్రౌండింగ్ చేస్తూ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో



నిర్మాణంలో ఉన్న నాలుగు తహసీల్దార్ కార్యాలయాల పనులను జూన్ రెండవ వారం నాటికి పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో నిర్మిస్తున్న ఇందిరా మహిళా శక్తి జిల్లా భవనం పనులను పూర్తి చేసి జూన్ 2న ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈఈ పంచాయతీరాజ్ శంకరయ్య, డి ఆర్ డి ఓ కాళిందిని, కలెక్టరేట్ ఏవో బండి ప్రకాష్, డీఈలు, ఏఈలు,సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అర్జీ1లో కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి

సీఎండీకి ఏఐటీయూసీ వినతిపత్రం

గోదావరిఖని ,ప్రభాతవార్త:



సింగరేణి ఆర్జీ1 ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీరు, వైద్య సేవలు, గనుల్లో మెటీరియల్ కొరత వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను కోరారు. శుక్రవారం జీడీకే11 ఇంక్లైన్ సందర్శనకు వచ్చిన సీఎండీకి ఏఐటీయూసీ అర్జీ1 బ్రాంచి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, ఆర్జీ1లో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న గ్రావిటీ వాటర్ ఫిల్టర్ బెడ్ పనులను త్వరగా పూర్తి చేసి కార్మికులకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏరియా ఆసుపత్రిలోని క్యాథ్‌ల్యాబ్‌కు "సింగరేణి క్యాథ్‌ల్యాబ్"గా పేరు మార్చాలని, మెడికల్ బోర్డు సమావేశాలను వెంటనే నిర్వహించాలని కోరినట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న మారుపేర్లు, విజిలెన్స్ కేసులకు సంబంధించిన కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించాలని, గనుల్లో పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలు ఏర్పాటు చేసి ఉత్పత్తి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఓసీపీ5కు కొత్త డంపర్లు, షావెల్స్, లోడర్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. సీఎస్ఆర్ నిధులను ప్రభుత్వ పథకాల కోసం కాకుండా కార్మిక కాలనీలు, ప్రభావిత గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని, ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమించి అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్లు, హ్యాండ్ గ్లౌజులు, నట్‌బోల్ట్స్ తదితర మెటీరియల్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు. అన్ని గనులు, విభాగాల్లో కార్మికుల సౌకర్యార్థం కఫ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా సీఎండీకి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌తో పాటు మాదన మహేష్, ఎస్. వెంకటరెడ్డి, సిద్దమల్ల రాజు, పి. విజయలక్ష్మి, సిర్ర మల్లికార్జున్, నాయిని శంకర్, గోడిశల నరేశ్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## పటిష్టంగా కోప్టా చట్టం అమలును చేపట్టాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**జిల్లాలో కోప్టా చట్టం2003 అమలును పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే. అరుణశ్రీతో కలిసి ఎన్‌టీసీపీ అండ్ కోప్టా చట్టం అమలుపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,లి కోప్టా చట్టం అమలు అత్యంత అవసరమని, అన్ని శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలను పొగాకు రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్టళ్లు, గురుకులాలు, పాఠశాలల సమీపంలో ఉన్న దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని సూచించారు. పోలీసు శాఖ సహకారంతో జూనియర్ కళాశాలలు, ఇంజినీరింగ్, డిగ్రీ కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, మార్కెట్ ప్రాంతాలు వంటి ప్రజా ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై వెంటనే జరిమానాలు విధించాలని తెలిపారు. అదే తప్పును పునరావృతం చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మైనర్లకు పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. అన్ని పొగాకు ఉత్పత్తులపై ఆరోగ్య హెచ్చరికలు తప్పనిసరిగా ఉండాలని, కోప్టా చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి వార్త

**ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ను కలిసిన రాష్ట్ర అధ్యక్షులు సుధమల్ల ఆనంద్ గౌడ్, ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి**

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:



భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్‌ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షులు సుధమల్ల ఆనంద్ గౌడ్, నూతనంగా నియమితులైన రాష్ట్ర ఓబీసీ మోర్చా కమిటీ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు సుధమల్ల ఆనంద్ గౌడ్ రాష్ట్రంలో ఓబీసీ మోర్చా బలోపేతం, పార్టీ విస్తరణతో పాటు సామాజిక వర్గాల అభ్యున్నతి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపై జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌తో చర్చించారు. డాక్టర్ కె.లక్ష్మణ్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేస్తూ, పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సమస్యలు, ఓబీసీ వర్గాల సంక్షేమ అంశాలపై సమర్థవంతంగా పనిచేస్తూ ప్రజల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలుకందుల సంధ్యారాణి, పాలకుర్తి మండల అధ్యక్షులు మెరుగు నరేష్ పాల్గొని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.

## వరి కొయ్యల కాల్చివేత అనర్థాలపై అవగాహన సదస్సు

-మండల వ్యవసాయ అధికారిణి టి. ప్రత్యూష

జూలపల్లి,ప్రభాతవార్త:



జూలపల్లి మండల కేంద్రంలోశుక్రవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట అవశేషాలను కాల్చడం వల్ల జరిగే అనర్థాలు పై మండల స్థాయి అవగాహన కార్యక్రమం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మజ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని టీ. ప్రత్యూష మాట్లాడుతూ రైతులు వరి కొయ్యకాలను కాల్చడం వల్ల పర్యావరణ కాలుష్యం తో పాటు భూమిలో ఉండే ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించి భూమి సారవంతం పూర్తిగా తగ్గిపోతుందని తద్వారా పంట దిగుబడి మీద ప్రభావం చూపుతుందని రైతులు ఆర్థికంగా నష్టపోతారని వివరించారు.రైతన్నలు పంట కోసిన తర్వాత పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో మల్చర్ సహాయంతో గాని,రోటవేటర్ తో గాని కలియదున్నడం వల్ల వాటి అవశేషాలు భూమిలో కలిసిపోయి సేంద్రియ కర్బనం మెరుగుపడుతుందని దీని వలన నేల ఆరోగ్యం బాగుపడి పంటకు మేలు జరుగుతుందని తెలిపారు.రైతులు వ్యవసాయ అవశేషాలను కాల్చకుండా సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగించాలని అలాగే జీలుగు వంటి పచ్చి రొట్టె ఎరువులు మండల కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని వాటిని సద్వినియోగపరుచుకోవాలని తెలిపారు.పంట అవశేషాలను కాల్చిన రైతులపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం జీవో 27 ప్రకారం 5000/ నుంచి 25 వేల రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దత్తు ప్రసాద్,ఎంపిఓ శేషయ్య సూరి,పోలీసు శాఖ ఎఎస్ఐ,ఎపిఓ సదానందం,ఏఈవో లు,వివిధ గ్రామాల సర్పంచులు,కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయేది కెసిఆర్ ప్రభుత్వమే

**సైనికుల్లా పనిచేయండి**

**మాజీమంత్రి కేటీఆర్**

చొప్పదండి:

కార్యకర్తలు అధైర్య పడవద్దని రాబోయేది తెలంగాణలో కెసిఆర్ ప్రభుత్వమేనని.. ప్రస్తుతం పార్టీని కింది స్థాయిలో పటిష్టపరి చేందుకై అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా ఇన్చార్జిలను నియమించడం జరిగిందని, నియమించిన ఇన్చార్జీలు పూర్తి బాధ్యత తీసుకొని సైనికుల్లా పనిచేసి పార్టీని పటిష్ట పరుస్తూ, కార్యకర్తలను సమన్వయం చేస్తూ వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపును ఖరారు చేసే దిశగా ముందుకు సాగాలని మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మాజీ



జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రామగుండం నియోజకవర్గానికి బి ఆర్ ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ ఇన్చార్జిగా నియమించడంతో శుక్రవారం రవీందర్ రెడ్డి కేటీఆర్ ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ యువకులైన మీకు అత్యంత బాధ్యతాయుతమైన పదవిని అప్పజెప్పడం జరిగింది అని, అంతే బాధ్యతగా తీసుకొని సైనికుల పనిచేస్తూ నియోజకవర్గంలో అందరినీ కలుపుకొని ఏకత్రాటిపై తీసుకువస్తూ కార్యకర్తలను చైతన్యవంతం చేస్తూ పార్టీ అభ్యర్థులే గెలుపే లక్ష్యంగా తీర్చిదిద్దాలని రవీందర్ రెడ్డిని కేటీఆర్ కోరారు. తనకు ఇచ్చిన బాధ్యతను చాలెంజ్ గా తీసుకొని రామగుండం నియోజకవర్గంలో బి ఆర్ ఎస్ పార్టీ డిజిటల్ మెంబర్షిప్ లో రికార్డు స్థాయిలో చేసి రాష్ట్రంలో ఆదర్శవంతమైన డిజిటల్ మెంబర్షిప్ నియోజకవర్గంగా తీర్చిదిద్ది మీ ముందుకు వస్తానని కేటీఆర్ కు రవీందర్ రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిపారు. త్వరలో రామగుండం నియోజకవర్గంలో అందరు ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలను కలిసి డిజిటల్ సభ్యత్వం వేగవంతం పై దృష్టి పెట్టి, అత్యధిక డిజిటల్ సభ్యత్వాలను చేపించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.

# చొప్పదండి వార్త

## చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి పట్టణంలో నీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను శుక్రవారం డాక్టర్ వెంకటరమణ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, కరీంనగర్ డాక్టర్ ఉమా శ్రీ ప్రోగ్రాం అధికారి ఎన్సిడి (ప్రాజెక్ట్ ఆఫీసర్, డిస్టిక్ డైనింగ్ టీం) లు చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా అన్ని రికార్డులు తనిఖీ చేయడం తో పాటు ఫార్మసీ స్టోర్ , ల్యాబ్, డెలివరీ రూములను పరిశీలించినారు. తదనగుణంగా తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ కీర్తన వైద్యాధికారులు, డాక్టర్ సురేందర్, వెంకటస్వామి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, జి శ్రీదేవి పర్యవేక్షకురాలు (స్త్రీ) జాకీర్ హుస్సేన్ (మగ) పర్యవేక్షకులు ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఆదేశాలతో రైస్ మిల్లులను సందర్శించిన ఏఎంసీ చైర్మన్

**మిల్లర్లకు సూచనలు చేసిన కొత్తూరి మహేష్**

చొప్పదండి,ప్రభాతవార్త:



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు చొప్పదండి మండలంలోని రైస్ మిల్లులను ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేష్ శుక్రవారం సందర్శించారు. ధాన్యం సరఫరా చేసే లారీలను వెంట వెంటనే ధాన్యాన్ని దించుకొని ధాన్యం సరఫరాకు ఎటువంటి అంతరాయం లేకుండా సహకారంఅందించాలని, ఎలాంటి కోతలు లేకుండా చూడాలని మిల్లర్లకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే సమయంలో అనవసరంగా తరుగు, కోతలు విధించవద్దని స్పష్టం చేశారు. రైతులకు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం నిల్వలు, తేమ శాతం, తూకంలో పారదర్శకత పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని, మిల్లర్లు కూడా రైతులకు అండగా నిలవాలని కోరారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలు జరగకుండా వారి ధాన్యం పండించిన ప్రతి రైతన్నను ఆదుకుంటామని, పండించిన ప్రతి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నారు. అన్నదాతలు ఎటువంటి ఆందోళనకు గురి కావద్దని ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ మండల రైతన్నలకు విజ్ఞప్తి చేశారు .

## కొండగట్టు పెద్ద జయంతి ముడుపుల ఆలయం లెక్కింపు

**మల్యాల /ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో పెద్ద జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన మడు పలు అయినటువంటి కొబ్బరికాయలు రెండు కొడుకులు బియ్యం మాలలు ను శుక్రవారం వేలం నిర్వహించగా దేవస్థానానికి గణనీయమైన ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు, ఈ సందర్భంగా, మాలలు వనం అంజి రూ ,5,90,000 కు, రెండు కొడుకులు వరంగల్ కు చెందిన ప్రభాకర్ రూ,51 వేలకు, ఎండు కొడుకులు పుత్తూరు సమ్మయ్య 95 చొప్పున దక్కించుకున్నారు, బియ్యం జగిత్యాల చెందిన శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ కిలోకు రూ, 15 చొప్పున దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు, ఆలయ ఈవో అంజన రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రాజమౌళి, సూపరిడెంట్ సునీల్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు,



## క్రీడల ద్వారా స్నేహ పూర్వక బంధాలు పెరుగుతాయి

**చొప్పదండి ఎస్సై నరేష్ రెడ్డి**

చొప్పదండి,ప్రభాతవార్త:



క్రీడల ద్వారా స్నేహపూర్వక బంధాలు పెరుగుతాయని చొప్పదండి ఎస్ఐ నరేష్ రెడ్డి పేర్కొన్నారు. చొప్పదండి పట్టణంలోని జిల్లా పరిషత్ క్రీడా మైదానం ఆవరణలో శుక్రవారం చొప్పదండి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మేడిపల్లి రూపా దేవి జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి ఫోటో అండ్ వీడియో గ్రాఫర్ క్రికెట్ పోటీలను ఎస్ఐ నరేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నిరంతరం శుభకార్యా లు ఫోటోలు వీడియోలు తీస్తూ బిజీ బిజీగా ఉండే ఫోటో వీడియో గ్రాఫర్లు ఐక్యంగా ఉండాలని ఉద్దేశంతో ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్ సుజిత్ రెడ్డి, రాజశేఖర్ తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంఘం ప్రధాన కార్యదర్శి సిరి రవి, కరీంనగర్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు తుమ్మ చందు, విజయ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొంగోని మధుసూదన్, నాయకులు వడ్లూరి శ్రీనివాస్, కొత్త గంగారెడ్డి, ముద్దం తిరుపతి, వడ్లూరు శ్యాం కుమార్, భద్రాద్రి క్రికెట్ టీం నిర్వాహకుడు మరిమడ్ల రాజిరెడ్డి, యామ మల్లేశం, పిట్టల శ్రావణ్ పిట్టల సందీప్ చొప్పదండి ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ బొడిగె అజయ్ కుమార్ గౌడ్, ఉపాధ్యక్షుడు నెల్లి శేఖర్, ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల మహేష్, కోశాధికారి సింహాచలం విశ్వమోహన్ ప్రచార కార్యదర్శి వడ్లూరు శశి, సభ్యులు తాటిపల్లి శివ, సిరిపురం శ్రీనివాస్ సామర్లపల్లి సుధాకర్, నాంపల్లి నరేష్ తెలుకుంట వేణు, పెద్ది శ్రీనివాస్, గజ్జల రమేష్, శేఖర్, వంశీ మహేష్, శ్యామ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు పెద్ద జయంతి ముడుపుల ఆలయం లెక్కింపు

**మల్యాల /ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో పెద్ద జయంతి ఉత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన మడు పలు అయినటువంటి కొబ్బరికాయలు రెండు కొడుకులు బియ్యం మాలలు ను శుక్రవారం వేలం నిర్వహించగా దేవస్థానానికి గణనీయమైన ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు, ఈ సందర్భంగా, మాలలు వనం అంజి రూ ,5,90,000 కు, రెండు కొడుకులు వరంగల్ కు చెందిన ప్రభాకర్ రూ,51 వేలకు, ఎండు కొడుకులు పుత్తూరు సమ్మయ్య 95 చొప్పున దక్కించుకున్నారు, బియ్యం జగిత్యాల చెందిన శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ కిలోకు రూ, 15 చొప్పున దక్కించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు, కార్యక్రమంలో ఆలయ ఈవో అంజన రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రాజమౌళి, సూపరిడెంట్ సునీల్, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు,

## ఎస్ ఆర్ ఎస్ పి కెనాల్ బ్రిడ్జ్ సైడ్ వాల్‌ను వెంటనే పునరుద్ధరించాలి

**బిజెవైయం జిల్లా నాయకులు సంగ నరేష్**

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి ధర్మారం రాష్ట్ర రహదారిపై మర్లవాడ వద్ద ఉన్న ఎస్ ఆర్ ఎస్ పి కెనాల్ బ్రిడ్జ్ సైడ్ వాల్ (రక్షణ గోడ) కూలిపోయి ప్రమాదకరంగా మారిందని, దానిని యుద్ధప్రాతిపదికన వెంటనే పునరుద్ధరించాలని బిజెవైయం జిల్లా నాయకులు సంగ నరేష్ డిమాండ్ చేశారు.ఈ విషయమై ఆయన శనివారం సంబంధిత అధికారి ఎ ఇ ఇ నరేష్‌తో ఫోన్ ద్వారా మాట్లాడి పరిస్థితిని వివరించారు.ఈ సందర్భంగా సంగ నరేష్ మాట్లాడుతూ చొప్పదండి ధర్మారం ప్రధాన రహదారి గుండా నిత్యం వేలాది వాహనాలు, ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. మర్లవాడ వద్ద ఉన్న కెనాల్ బ్రిడ్జ్ సైడ్ వాల్ దెబ్బతినడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు కెనాల్‌లోకి దూసుకెళ్లి పెద్ద ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రయాణికుల ప్రాణాలను దృష్టిలో ఉంచుకుని, అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జ్ సైడ్ వాల్ మరమ్మతు పనులను చేపట్టాలని కోరారు. దీనిపై ఎ ఇ ఇ నరేష్ సానుకూలంగా స్పందిస్తూ, త్వరలోనే పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎ ఇ హామీ ఇచ్చారని తెలిపారు.

## మానాలలో వడదెబ్బతో ఉపాధి కూలి మృతి

మల్యాల/ ప్రభాతవార్త



మల్యాల మండలంలోని మానాల గ్రామం శుక్రవారం నిర్వహిస్తున్న ఉపాధి పనులకు వెళ్లిన ఎడిపల్లి గంగారెడ్డి (58) అనే వ్యక్తి పని ప్రదేశం వద్ద ఎండ తీవ్రతకు అస్వస్థకు గురై స్వహ తప్పి పడిపోయాడు, వెంటనే అతన్ని జగిత్యాలలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు స్థానికుల ద్వారా తెలిసింది, కాగా, ఉపాధి కూలి పనికి వెళ్ళిన గంగారెడ్డి ఎండ దెబ్బ తగిలి మృతి చెందడం పట్ల మానాల సర్పంచ్ బలమూరీ పాపారావు మృతిని కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు, వడదెబ్బతో మృతి చెందిన గంగారెడ్డి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు,

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై అవగాహన సదస్సు

### తహసీల్దార్ కార్యాలయం ముట్టడించిన బీజేపీ నాయకులు

**వేములవాడ రూరల్ ప్రభాత వార్త:**
వేములవాడ రూరల్ మండల బీజేపీ అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా కార్యక్రమంపై కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను నిరసిస్తూ ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి గోపాటి సురేంద్రరావు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో ఉన్న బోగస్ ఓట్లను గుర్తించి తొలగించే దిశగా బూత్ అధ్యక్షులు, బీఎల్ఏ2లు మరియు ప్రతి బీజేపీ కార్యకర్త చురుకుగా పనిచేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు సమస్యలపై ఇప్పటికే తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి పది రోజులు



గడిచినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. వర్షాలు కురిసే పరిస్థితులు ఉన్నందున ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు జంకె మధు, సండే సారి మల్లికార్జున్, మండల ప్రధాన కార్యదర్శి వనపర్తి పరశురాములు, మండల ఉపాధ్యక్షులు లింగంపల్లి కుంటయ్య, నల్ల వెంకటరెడ్డి, లింగంపల్లి కిషోర్, జంగం వంశీ, గౌతమ్, కొత్తపల్లి గంగాధర్, సారా నర్సయ్య, లింగంపల్లి రాజు, లింగంపల్లి రవీందర్, నేదురి లక్ష్మణ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా టీ ఫైబర్ కేబుల్ వైరు

**చందుర్తి / ప్రభాతవార్త:**
చందుర్తి మండలంలో పలు గ్రామాలకు ఇంటర్నెట్ అందించడానికి ప్రభుత్వం ప్రతి గ్రామానికి టి ఫైబర్ కేబుల్ కనెక్షన్ ఇచ్చారు. దీంతో కేబుల్ అమర్చడానికి రోడ్ పక్కన పోల్స్ వేశారు. దీంతో వాహనాలు పోల్స్ ను తాకడం తో పోల్స్ దెబ్బతిన్నాయి. దీంతో కేబుల్ వైర్ వాహన దారులకు తాకడంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఏర్పడింది. మూడపల్లిఅనంత పల్లి వెళ్లే రోడ్ మార్గంలో కేబుల్ వైర్ మనిషికి అందే ఎత్తులో ఉంది. వ్యవసాయ సాగుకు ఆటంకంగా కేబుల్ స్తంభాలు వేశారు, వ్యవసాయ క్షేత్రాల వద్ద చెట్ల కొమ్మల నుండి కేబుల్ బిగించి గ్రామాల్లోకి లైన్ ఇవ్వడంతో వ్యవసాయ దారులు పొలాలు సాగు చేసే క్రమంలో వరి కోత సమయంలో వ్యవసాయ



యంత్రాల కు అడ్డుగా రావడంతో ప్రమాదం చోటు చేసుకునే ఆవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రమాదకరంగా మారిన కేబుల్ వైర్లను సరి చేసే విధంగా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## వీవోఏల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

### బీఆర్ఎస్ నాయకుల సంఘీభావం

**ప్రభాత వార్త కోనరావుపేట :** కోనరావుపేట మండలంలో కొనసాగుతున్న వీవోఏల నిరాహార దీక్షలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు శుక్రవారం సంఘీభావం తెలిపారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య ఆధ్వర్యంలో దీక్షా శిబిరాన్ని సందర్శించిన నాయకులు వీవోఏల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వీవోఏలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించి అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. గత పది రోజులుగా మండలకేంద్రంలో వీవోఏలు దీక్షలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వీవోఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్ల క్ష్యం చేస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని బీఆర్ఎస్



నాయకులు హెచ్చరించారు. ప్రజలకు సేవలు అందిస్తున్న వీవోఏల పట్ల ప్రభుత్వం సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ వైస్ చైర్మన్ అనుపాటి భూంరెడ్డి, ఉప సర్పంచ్ తిక్కల నవీన్, మాజీ సర్పంచ్ లు మంతెన సంతోష్, కేంద గంగాధర్, నర్సయ్య, నాయకులు మందాల శ్రీనివాస్, దొంతరవేణి శ్రీనివాస్ గౌడ్ , శివతేజ రావు, అరె మహేందర్, రవీందర్ గౌడ్, యాస రాజం, పర్శరాములు గౌడ్, బుట్టి వంశీ, తదితరులు పాల్గొన్నారు.

## మృతికి కారకుడైన వ్యక్తికి రెండు సంవత్సరాల కారాగార శిక్ష

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:**
జగిత్యాల జిల్లాలో ఏడేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదానికి సంబంధించి ధర్మపురి జెఎంఎఫ్ సి కోర్టు సంచలన తీర్పును వెలువరించింది. అతివేగం, అజాగ్రత్తతో స్కూల్ బస్సును నడిపి ఓ ప్రధానోపాధ్యాయుడి మృతికి కారణమైన డ్రైవర్‌కు న్యాయస్థానం రెండేళ్ల కఠిన కారాగార శిక్షను ఖరారు చేసింది. వివరాల్లోకి వెళితే, వెల్గటూర్ మండలం బీరుసాని గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆవుల సంపత్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. 2017, ఆగస్టు 29న విధులను ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. అదే సమయంలో మార్గమధ్యంలో వెల్గటూర్ మండలం ముత్తునూర్‌కు చెందిన స్కూల్ బస్సు డ్రైవర్ పొకాపురం లచ్చయ్య, తన బస్సును అత్యంత వేగంతో, అజాగ్రత్తగా నడిపి సంపత్ వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంపత్‌ను స్థానిక ఆసుపత్రి నుంచి కరీంనగర్, ఆపై మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన సెప్టెంబర్ 6న తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై బుగ్గారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసిన నాటి ఎస్సై మధుకర్, సమగ్ర దర్యాప్తు చేపట్టి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మపురి జె ఎం ఎఫ్ సి న్యాయమూర్తి యేగి జానకి, సాక్ష్యాధారాల ఆధారంగా డ్రైవర్ లచ్చయ్య నేరం చేసినట్లు నిర్ధారించారు. నిందితుడికి రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. చట్టాన్ని అతిక్రమించి, అజాగ్రత్తతో ఇతరుల ప్రాణాలు తీసే వారికి ఇటువంటి తీర్పులు పాఠం కావాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## సతీష్‌కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం

### నాగారం వాసికి అరుదైన గౌరవం



**కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:** సినీ పరిశ్రమలో అత్యంత పురస్కారమైన మహానటుడు ఎన్టీఆర్ స్మారక పురస్కారం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన మాసం సతీష్ కు దక్కింది. కొన్నిళ్లుగా సినీ పరిశ్రమలో ఫోటోగ్రాఫర్ గా రాణిస్తున్న సతీష్ ప్రతిభను గుర్తించి ఈ పురస్కారాన్ని సినీ ప్రముఖుల మధ్య అందజేశారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన కేరాంప్ చిత్రానికి సతీష్ అందించిన విజువల్స్ కి 2025 సంవత్సరానికి ప్రతిష్టాత్మక శ్రీకళావేదిక నందమూరి తారక రామారావు స్మారక అవార్డుకి లభించింది. గత 60 సంవత్సరాలుగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పురస్కారాన్ని, నందమూరి కుటుంబ సభ్యుల సమక్షంలో జిల్లాకు చెందిన సతీష్ అందుకోవడం గర్వకారణం. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఈ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని, దీంతో మరింత బాధ్యత పెరిగి రానున్న రోజుల్లో మరిన్ని మంచి చిత్రాలకు ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేలా కృషి చేస్తామన్నారు. సతీష్ కు ఈ పురస్కారం తగ్గడంపై సర్పంచ్ అప్పాల నాగభూషణం, అభినందించారు.

వేములవాడ వార్త

## బండపల్లిలో ఘనంగా గంగమ్మ బోనాల పండుగ

**చందుర్తి/ ప్రభాతవార్త:**



చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో గంగమ్మ బోనాల పండుగ శుక్రవారం సాయంత్రం ఘనంగా జరిగింది, ఆలయంలో ఈనెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు ప్రతిష్ఠాపన కార్యక్రమం తో పాటు పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు, గురువారం రోజున ఆలయంలో గణపతి ప్రతిష్ఠాపన, హోమం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, శుక్రవారం రోజున గంగమ్మ బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు, డప్పు చప్పుళ్ళు, బైండ్ల వారి నృత్యాలు, గంగపుత్రుల కులవృత్తి చేపల వలతో నృత్యాలు చేస్తూ బోనాల వేడుకల్లో పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నాయకులు పందిరి శ్రీనివాస్, పందిరి లచ్చయ్య, పల్లికొండ లచ్చయ్య, గవస్కర్, రాజేష్, రవి, అశోక్, పందిరి నర్సయ్య, తోపారపు నర్సయ్య, దత్తయ్య, సత్తయ్య, పోచయ్య తో పాటు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

## పంట అవశేషాలు కాల్చొద్దు... నేల సారాన్ని కాపాడండి

### రైతులకు వ్యవసాయ శాఖ సూచనలు

**వేములవాడ రూరల్ ప్రభాత వార్త:**



వరి కోతలు పూర్తైన నేపథ్యంలో రైతులు తదుపరి సాగు సీజన్‌కు భూమిని త్వరగా సిద్ధం చేసుకునేందుకు పంట అవశేషాలను తగులబెడుతున్నారని, ఈ విధానం వల్ల పర్యావరణంతో పాటు నేల ఆరోగ్యానికి కూడా తీవ్ర నష్టం కలుగుతుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల గాలి కాలుష్యం, అగ్ని ప్రమాదాలు, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉండటమే కాకుండా, కొన్నిసార్లు ప్రాణనష్టం కూడా చోటుచేసుకునే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పంటలకు వేసిన ఎరువులను మొక్కలు పూర్తిగా వినియోగించుకోవని, కొంతమేర పోషకాలు నేలలో మరియు పంట అవశేషాలలో మిగిలి ఉంటాయని అధికారులు తెలిపారు. అయితే అవశేషాలను కాల్చివేయడం వల్ల ఆ విలువైన పోషకాలు కూడా నష్టపోతాయని పేర్కొన్నారు. పంట అవశేషాల దహనం వల్ల నత్రజని 70 నుండి 80 శాతం వరకు, భాస్వరం 20 నుండి 25 శాతం, పొటాష్ 20 నుండి 25 శాతం, గంధకం 50 శాతం వరకు నష్టపోతాయని తెలిపారు. ముఖ్యంగా నేల సారానికి ఎంతో అవసరమైన సేంద్రియ కార్బన్ తగ్గిపోవడంతో నేల జీవశక్తి బలహీనపడు తుందని వివరించారు.

## పంట వ్యర్థాలను కాల్చితే చట్టరీత్యా చర్యలు

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండల రైతులు వారి వ్యవసాయ భూమిలో వేసిన పంట కోత అనంతరం వ్యర్థాలను, గడ్డిని వారి యొక్క పొలాలలో/చేన్లలో కాల్చడం చట్ట రీత్యా నేరమని స్థానిక ఎస్ ఐ అశోక్ శుక్రవారం తెలిపారు. అలాగే పంటకు అవసరమైన బ్యాక్టీరియా చనిపోతుందని సూచించారు. అంతేకాకుండా ఇలా చేసిన వారిపై జీవో నెంబర్ 27 ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయన్నారు. తాళ్లపల్లి గ్రామ శివారులో తన వరి పొలంలో గడ్డికి నిప్పు పెట్టగ ఎలుక నారాయణ అనే రైతు అదే మంటలో కాలి మరణించడం బాధాకరమన్నారు.

మంథని వార్త



## అర్హులకందని వితంతు పెన్షన్లు

### జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని బాధితుల విజ్ఞప్తి

రామగిరి ప్రభాతవార్త: భర్తలు మరణించి సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ వితంతు పెన్షన్లు మంజూరు కాకపోవడంతో పలువురు మహిళలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రామగిరి మండలంలో ప్రస్తుతం 3,600 మందికి పైగా ప్రభుత్వం నుంచి వివిధ రకాల సామాజిక పెన్షన్లు అందుకుంటుండగా, కొత్తగా వితంతు పెన్షన్ మంజూరు చేయాలంటూ వందల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.ప్రభుత్వం కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామని ప్రకటిస్తున్నప్పటికీ, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న పలువురు వితంతువులకు ఇప్పటికీ పెన్షన్లు అందకపోవడం పట్ల బాధితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భర్తకు వృద్ధాప్య పెన్షన్ వస్తున్న సమయంలో ఆయన మరణిస్తే, ఆ కుటుంబంలోని భార్యకు వెంటనే వితంతు పెన్షన్ మంజూరు చేయాల్సి ఉండగా, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం మరియు సరైన అవగాహన లోపం కారణంగా అనేక దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు.పెన్షన్ కోసం పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు సరైన స్పందన ఇవ్వడం లేదని మహిళలు వాపోతున్నారు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమలాంటి వితంతువులకు ప్రభుత్వం అందించే పెన్షన్ ఎంతో ఆధారంగా ఉంటుందని, కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నిజమైన అర్హులు నష్టపోతున్నారని స్థానికులు అభిప్రాయప డుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి, రామగిరి మండలంలో పెండింగ్‌లో ఉన్న వితంతు పెన్షన్ దరఖాస్తులను సమగ్రంగా పరిశీలించి, అర్హులైన ప్రతి మహిళకు తక్షణమే పెన్షన్ మంజూరు చేయాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లను పరిశీలించిన జియంలు

రామగిరి ప్రభాతవార్త: జూన్ 2 తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల కోసం స్థానిక రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో చేయవలసిన ఏర్పాట్లను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసే వివిధ రకాల స్టాల్స్, సభ ప్రాంగణం, అమర వీరుల స్తూపం వద్ద ఏర్పాట్లను ఏ విధంగా చేయాలో అలాగే వేడుకలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, పరిసర ప్రాంతాల వారు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. వారి తో పాటు ఏరియా ఇంజనీర్ సుధాకర్ రెడ్డి, ఇంచార్జ్ ఎస్వో టుజియం పి.రాజారెడ్డి, ఐ ఈ డిజియం బి.టి. మురళీ కృష్ణ, సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఏరియా వర్క్ షాప్ డిజియం చక్రవర్తి, ఇంచార్జ్ సెక్యూరిటీ అధికారి కోల శ్రీనివాస్, తో పాటు ఇతర అధికారులు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



## కల్వచర్లలో ప్రమాదవశాత్తు తాటివనం అగ్నికి ఆహుతి

### -ఫైర్ ఇంజన్‌తో మంటలు ఆర్పివేత

రామగిరి ప్రభాతవార్త:



రామగిరి మండలంలోని కల్వచర్ల గ్రామ శివార్ లో శుక్రవారం పంట పొలాల్లో కొయ్యకల్లనుకాల్చివేయడానికి రైతులు పెట్టిన మంటలు అదుపుతప్పి పక్కనే ఉన్న తాటివనానికి వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఎన్నో తాటి, ఈత చెట్లు అగ్నికి ఆహుతికావడంతో గౌడ కులస్తుల జీవనాధారం తీవ్రంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న మంథని అగ్నిమాపక కేంద్రం సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని దాదాపు రెండు గంటలు శ్రమించి మంటలను అదుపులోకి తీసుక వచ్చారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి వెంటనే హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అలాగే మాజీ జెడ్పిటిసి గంట రమణారెడ్డి, తోట చంద్రయ్య ,బుద్దార్తి బుచ్చయ్య, మాజీ ఎంపీటీసీ ముస్త్యల శ్రీనివాస్, అవినాష్ గౌడ్, కాటా రాజేందర్, కాట మల్లయ్య, గ్రామస్తులతో కలిసి మంటలను ఆర్పేందుకు శ్రమించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటి, ఈత చెట్లు గౌడ కులస్తుల కుటుంబాలకు ప్రధాన జీవనాధారం. ఒక్క చెట్టు కాలిపోవడం అంటే ఒక కుటుంబం ఆశలు, భవిష్యత్తు కాలిపోవడమే. ప్రభుత్వం మరియు సంబంధిత అధికారులు వెంటనే స్పందించి బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని కోరారు.అలాగే రైతులకు విజ్ఞప్తి చేస్తూపొలాల్లో కొయ్యకల్లను కాల్చడం వల్ల భూసారం తగ్గిపోవడమే కాకుండా ఇలాంటి అగ్నిప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉంటుందని తెలిపారు. కొయ్యకల్లను నీటిలో మురగపెట్టి జమ్ము కొట్టినట్లయితే అది సహజ ఎరువుగా ఉపయోగపడుతుందని, రైతులు అగ్ని ప్రమాదాలకు దారితీసే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.

## వరి కొయ్యలు కాల్చవద్దు

### మండల వ్యవసాయ అధికారి నవ్య



మంథని ప్రభాతవార్త: రైతులు వరి కొయ్యలను కాల్చి వేసే పద్ధతిని మానుకోవాలని దీనివలన భూసారం తగ్గడంతో పాటు అనేక రకాలుగా నష్టం వాటిల్లుతుందని మంథని వ్యవసాయ అధికారి డాక్టర్ దాసరి నవ్య తెలిపారు. వానకాలం పంట సాగులో భాగంగా భూమిని సిద్ధం చేసే క్రమంలో రైతులు పంట వ్యర్థాలను కాల్చకూడదని కోరారు. పంట వ్యర్థా లను కాల్చడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా వాయు కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నేలలో అవసరమైన సూక్ష్మ జీవులు చనిపోతాయని, అంతే కాకుండా ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంట వ్యర్థాలను కాల్చడం వలన నేలలోని సేంద్రియ కర్బన పదార్థం దెబ్బతింటుందని, బాస్వరం, పొటాష్ వంటి ప్రధాన పోషకాలతోపాటు సూక్ష్మ పోషకాలు కూడా నశిస్తాయని వివరించారు. పంట అవశేషాలను నేలలో కలియ దున్నడం ద్వారా సేంద్రియ కార్బన్ పెరిగి భూసారం పెరగడంతో పాటు ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాల బహిరంగ దహనాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 27 ప్రకారం వ్యర్థాలను కాల్చితే రూ.5 వేల నుంచి 25 వేల వరకు పర్యావరణ పరిహార రుసుము విధించడం జరుగుతుందని హెచ్చరించారు. భూమి ఆరోగ్యం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రైతులు ఎట్టి పరిస్థితులను కాల్చవద్దని ఆమె కోరారు.

## గణిత ఉపాధ్యాయుడిని అభినందించిన విద్యాశాఖ కమిషనర్

రామగిరి ప్రభాతవార్త: రామగిరి మండ్సల బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మల్కా రామ కిషన్ రావును స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఈ. నవీన్ నికోలస్ హైదరాబాదు లోని తన కార్యాలయంలో అభినందించారు. పదవ తరగతి విద్యార్థుల్లో చదువు ఆసక్తి రీడింగ్ కార్నర్స్ ఏర్పాటు చేయడం ఉత్తమ ఫలితాలు 550పై మార్కులు సాధించిన



విద్యార్థులను విమాన ప్రయాణానికి తీసుకెళ్లడం వంటి కార్యక్రమాలను ప్రశంసించారు. పాఠశాలలో నిర్వహిస్తున్న విద్యా కార్యక్రమాల గురించి, అడిగి తెలుసుకున్నారు. గత రెండు సంవత్సరాల నుండి అత్యుత్తమ మార్కులతో విద్యార్థులు పాస్ అవుతున్నందుకు ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. పాఠశాలను ఈ విద్యా సంవత్సరంలో సందర్శిస్తానని తెలియజేశారు. ఉపాధ్యాయులందరూ మరింత బాధ్యతగా పనిచేసి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని సూచించారు.

### వరి కొయ్యలు కాల్చితే

## రూ.25 వేల వరకు జరిమానా

### వ్యవసాయ శాఖ మండల వ్యవసాయ అధికారి జె.అనూష

### పంట వ్యర్థాలను తగులబెట్టవద్దని రైతులకు విజ్ఞప్తి



ముత్తారం, ప్రభాతవార్త: వరి కొయ్యలు కాల్చితే రూ.25 వేల వరకు జరిమానా విధిస్తామని ముత్తారం మండల వ్యవసాయ అధికారి జె.అనూష ఒక ప్రకటనలో హెచ్చరించారు. వానకాలం సాగులో భాగంగా భూమిని సిద్ధం చేసే క్రమంలో వరి రైతులు పంట వ్యర్థాలను కాల్చకూడదని తెలిపారు. పంట వ్యర్థాలను కాల్చడం వల్ల భూసారం తగ్గడమే కాకుండా వాయు కాలుష్యం ఏర్పడుతుందని పేర్కొన్నారు. నేలలో అవసరమైన సూక్ష్మ జీవులు చనిపోతాయని, అంతే కాకుండా ప్రాణ, ఆస్తి నష్టం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పంట వ్యర్థాలను కాల్చడం వలన నేలలోని సేంద్రియ కర్బన పదార్థం దెబ్బతింటుందని, బాస్వరం, పొటాష్ వంటి ప్రధాన పోషకాలతోపాటు సూక్ష్మ పోషకాలు కూడా నశిస్తాయని వివరించారు. పంట అవశేషాలను నేలలో కలియ దున్నడం ద్వారా సేంద్రియ కార్బన్ పెరిగి భూసారం పెరగడంతోపాటు ఎరువుల వినియోగం కూడా తగ్గుతుందని సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వ్యర్థాల బహిరంగ దహనాన్ని నిషేధిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 27 ప్రకారం వ్యర్థాలను కాల్చితే రూ.5 వేల నుంచి 25 వేల వరకు పర్యావరణ పరిహార రుసుము విధించడం జరుగుతుందని హెచ్చరించారు. నేల ఆరోగ్యం కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మండల వ్యవసాయ అధికారి జె.అనూష పిలుపునిచ్చారు.

## ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

### ముత్తారం మండల వ్యవసాయ అధికారి జె.అనూష

### మండలంలోని ఎరువుల దుకాణాలలో తనిఖీలు



ముత్తారం, ప్రభాతవార్త: ఎరువులను ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుం టామని ముత్తారం మండల వ్యవ సాయ అధికారి జె.అనూష హెచ్చ రించారు. శుక్రవారం ముత్తారం మండ లంలోని పలు ఎరువుల దుకా ణాలలో తనిఖీలను నిర్వహిం చారు. ఇందులో భాగంగా ఎరువుల యొక్క రిజిస్టర్లు, స్టాక్ వివరాలను తనిఖీ చేయడం జరిగింది. ఎరువుల నిల్వలు గురించి తెలుసుకోవడం జరిగింది. అదేవిధంగా రైతులకి వానకాల సాగు కోసం అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచామని సూచించారు. అంతేకాకుండా పాత స్టాక్‌ను పెరిగిన ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు.

## మంథని అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కుమార్



మంథని ప్రభాతవార్త: మంథని అడిషనల్ కోర్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా ఆర్ల కుమార్ శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అంతర్గాం మండలం రాయదండి గ్రామానికి చెందిన కుమార్ పరకాల అడిషనల్ మెజిస్ట్రేట్ కోర్టులో ఏపీపీగా పని చేస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా పరకాల నుంచి మంథని కోర్ట్ కు బదిలీ అయ్యారు. కుమార్ కి కోర్టు సిబ్బంది పుష్పగుచ్చాలు ఇచ్చి స్వాగతం పలికారు.

ధర్మపురి వార్త

# ధాన్యం కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం

-బీఆర్ఎస్ నాయకులు చందు

గొల్లపల్లి-ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి, మొక్క జొన్న కొనుగోళ్లలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ యువ నాయకుడు అవారి చందు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎలాంటి కటింగ్‌లు లేకుండా వడ్లు కొనుగోలు చేస్తామని హామీలు ఇచ్చి రైతులను నమ్మించిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్వింటాకు 7 నుండి 8 కిలోల వరకు కటింగ్‌లు విధిస్తూ రైతులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో కిలోన్నర కటింగ్‌కే తీవ్ర విమర్శలు చేసిన ముఖ్యమంత్రి, ఇప్పుడు జరుగుతున్న భారీ కటింగ్‌లపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. వరి వేస్తే కేంద్ర ప్రభుత్వం కొనడం లేదని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, మక్కజొన్న పంట కొనుగోళ్ల విషయంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రస్తుతం మక్కలు కల్లాల్లోనే మగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే సీజన్‌లో సన్న రకాల వరి మాత్రమే వేయాలని ప్రభుత్వం సూచించడం సరికాదని, రైతు ఏ పంట వేయాలో కూడా ప్రభుత్వం నిర్ణయిస్తే రైతు స్వేచ్ఛ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా రైతుల కష్టాన్ని గుర్తించి వారు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఖరిపై రైతుల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందని అవారి చందు పేర్కొన్నారు.

# వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై అవగాహన

గొల్లపల్లి, ప్రభాతవార్త :

గొల్లపల్లి మండలం అంగన్వాడి ఇబ్రహీం నగర్ సెక్టార్ పరిధిలోని రాపల్లి గ్రామంలో నీ ప్రాథమిక పాఠశాలలో గర్భవతులకు వెయ్యి రోజుల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భవతి అని తెలిసిన రోజు నుంచి బిడ్డకు రెండు సంవత్సరాల వయస్సు నిండే వరకు ఉన్న కాలాన్ని"1000 డేస్"గా పరిగణిస్తారని వివరించారు. ఈ కాలంలో తల్లి, శిశువు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని తెలిపారు. పిల్లలు వారి వయస్సుకు అనుగుణంగా చేరుకోవాల్సిన మైలురాళ్ల గురించి తల్లులకు వివరించి చెప్పారు. పిల్లలు తగిన మైలురాళ్లు చేరుకోకపోతే వెంటనే వైద్యుల సలహాలు తీసుకోవాలని సూచించారు. బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు తప్పనిసరిగా తాగించాలని, ఆరు నెలల వయస్సు పూర్తయ్యే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలియజేశారు. అనంతరం ఆరు నెలలు నిండిన తర్వాత అనుబంధ పోషకాహారం ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాపల్లి సర్పంచ్ బుర్ర సుధారాణి భూమయ్య, సూపర్వైజర్ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు విజయ, వనిత, ఆయాలు, తల్లులు, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.




# అగ్నిప్రమాదంతో ఆయిల్ ఫామ్ తోటలు దగ్ధం

ధర్మపురి, ప్రభాతవార్త:



వరి కొయ్యకాలుకు పెట్టిన నిప్పుతో మండలంలోని ఇరువురు రైతులకు చెందిన ఆయిల్ ఫామ్ తోటలు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధం అయ్యాయి. బాధితులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ధర్మపురి పట్టణం చెందిన ఎల్లాగౌడ్ తన 10 ఎకరాల వ్యవసాయ పొలంలో ఆయిల్ ఫామ్ తోటను సాగు చేస్తుండగా, నాగారం గ్రామానికి చెందిన గడ్డం రామ్ రెడ్డి సైతం ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్నాడు. చుట్టుపక్కన రైతులు వరి కొయ్యకాలు కు నిప్పు పెట్టగా, గాలికి మంటలు వ్యాపించాయి. దాంతో ఆయిల్ ఫామ్ తోటలు దగ్ధమయ్యాయి. సుమారు 7 ఎకరాల తోటతో పాటు, పైప్ లు కాలిపోయాయని ఎల్లా గౌడ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

# ఈ నెల 30 నుండి పచ్చిరొట్ట, జీలుగా విత్తనాల పంపిణీ

ధర్మపురి, ప్రభాతవార్త:

ధర్మపురి మండలంలోని రైతులకు ఈనెల 30 నుండి పచ్చిరొట్ట, జీలుగా విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి రాజ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలతో నేలసారం పెరుగుతుందని రైతులు దీనిని సద్వినియోగించుకోవాలని సూచించారు. ధర్మపురి, జైన, తిమ్మాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రాలతో పాటు ధర్మపురి లోని ఆగ్రోస్ రైతుసేవ కేంద్రం, డీసీఎంఎస్, దొంతాపూర్ లోని డీసీఎంఎస్ లో ఇట్టి విత్తనాలు అందుబాటులో ఉంటాయని ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాల కోసం వచ్చే రైతులు తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు. 2.5 ఎకరాలకు 1 జీలుగుబస్తా పొందవచ్చని, వీటిపై సబ్సిడీ సైతం లభిస్తుందని, ఇట్టి అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

# గీత కార్మికులకు అగ్ని ప్రమాదాల సెగ

## నష్టపరిహారం చెల్లించి, భూమి కేటాయించండి

## మాజీ మంత్రి జీవన్ రెడ్డి డిమాండ్

జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:జగిత్యాల మండలం రూరల్ కన్నాపూర్ గ్రామంలో అగ్ని ప్రమాదానికి గురైన ఈత, తాటి వనాలను శుక్రవారం రోజున మాజీ మంత్రి బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, న్యాయవాది రాంచంద్ర రెడ్డి, సర్పంచ్ సతీష్, డాక్టర్ చంద్రశేఖర్ గౌడ్, స్థానిక గీత కార్మికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ, గీతా కార్మిక వృత్తి అత్యంత ప్రమాదకరమైనదని, ప్రస్తుత పరిస్థితుల్లో గ్రామా గ్రామాన బెల్ట్ షాపుల విస్తృతి గీత వృత్తికే ప్రమాదంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి కాలంలో వడగాల్పుల వల్ల ఈత వనాలు కాలిపోతున్న ఘటనలు పత్రికల్లో నిత్యం చూస్తున్నామని, ఎక్కడైతే ఈత, తాటి వనాలు అగ్ని ప్రమాదాలకు గురవుతాయో అక్కడ రైతులకు పంట నష్టపరిహారం చెల్లించినట్టే గీత కార్మికులకు కూడా పరిహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. కన్నాపూర్, నర్సింగాపూర్ జాబితాపూర్, సహా 21 గ్రామాల్లో ఈత, తాటి వనాలు అగ్ని ప్రమాదాలకు గురయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఈత వనం కాలిపోవడంతో కార్మికులు సంవత్సరం లేదా రెండు సంవత్సరాల కాలం పాటు ఉపాధి కోల్పోతున్నారని, చెట్లు తిరిగి గీతకు రావాలంటే మరో రెండేళ్ల పడుతుందని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో, ప్రతి గీత సహకార సంఘానికి 5 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని, నిబంధనల ప్రకారం ప్రభుత్వ భూములు అందుబాటులో లేని చోట భూ కొనుగోలు పథకం ద్వారా 50 శాతం సబ్సిడీ, 50 శాతం బ్యాంక్ రుణంతో భూమి కల్పించాలని డిమాండ్ చేశారు. తద్వారా దశాబ్ద కాలం పాటు ఉపాధి పొందే అవకాశం ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా బెల్ట్ షాపులను అరికట్టడమే అత్యంత ప్రధానమని ఆయన నొక్కి చెప్పారు. లైసెన్స్ ఉన్న వైన్ షాపులకు వేళలు ఉన్నాయని, కానీ బెల్ట్ షాపులకు ఎలాంటి నిబంధనలు, వేళలు లేవని, ఆన్లైన్ బుకింగ్ లాగా అర్ధరాత్రి కూడా మద్యం అందుతోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బెల్ట్ షాపులను నియంత్రిస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇంతవరకు గీత కార్మికుల కోసం ప్రత్యేకంగా చేపట్టిన కార్యక్రమం ఏదీ లేదని, అంతా ప్రకటనలకే పరిమితమైందని ఆయన విమర్శించారు. నర్సింగాపూర్ గ్రామంలో కూడా తాను గతంలో ఇదే విషయాన్ని విజ్ఞప్తి చేశానని, ప్రభుత్వ భూములు లేని చోట ప్రైవేట్ భూమిని కొనుగోలు చేయడంతో పాటు, చెట్లను పెంచుకోవడానికి నీటి సదుపాయం, పైప్ లైన్ సౌకర్యం కల్పించాలని కోరారు. బెల్ట్ షాపుల ద్వారా ప్రభుత్వం పొందే ఆదాయం కంటే, వాటి వల్ల ప్రజల ఆరోగ్యం, సామాన్య ప్రజల ఆర్థిక వ్యవస్థపై పడే భారం లక్షల కోట్లని, పోలీస్ ఆబ్కారీ శాఖలు వీటిని నియంత్రించడంలో విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అగ్ని ప్రమాదానికి గురైన ఈత, తాటి వనాల నష్టానికి పరిహారం చెల్లించాలని, కన్నాపూర్ గ్రామస్తులకు అండగా ఉండాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రమేష్ బాబు, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, చంద రాదకిషన్ వెంకటేష్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.



# అగ్ని తాకిడికి దగ్ధమైన మామిడి తోటను పరిశీలించిన నగునూరి నర్సగౌడ్

మామిడి తోట నష్టపరిహారానికి సర్వే చేపట్టిన అధికారులు

బుగ్గారం-ప్రభాతవార్త:



బుగ్గారం మండలం యశ్వంతరావు పేట గ్రామంలో గురువారం రోజున అగ్నికి ఆహుతైన మామిడి తోట బండ భూమక్క కాంతయ్య వారి రెండు ఎకరాల మామిడి తోటలో 70 మామిడి చెట్లు డ్రిప్పు పైపులతో సహా పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లగా ఆ విషయం తెలుసుకున్న బుగ్గారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగునూరి నర్స గౌడ్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు తెలియజేయగా మంత్రి సూచన మేరకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు నగునూరి నర్సగౌడ్ నష్టం వాటిల్లన మామిడి తోట ను పరిశీలించి సంబంధిత అధికారులకు ఫోన్లో మాట్లాడి వారికి తెలియజేయగా వ్యవసాయ అధికారి అక్షిత, ఆర్టికల్చర్ అధికారి వంశీకృష్ణ, రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి మామిడి తోటను పరిశీలించడం జరిగింది. ఎంత నష్టం వాటిల్లిందనీ సర్వే చేపట్టారు. అధికారులు సర్వ చేపట్టిన తర్వాత మామిడి తోట బాధిత రైతు కుటుంబానికి తగిన నష్టపరిహారం అందే విధంగా ప్రయత్నిస్తామంటూ అధికారులు రైతుకు భరోసానిచ్చారు. నరస గౌడ్ మాట్లాడుతూ రైతు కుటుంబానికి నష్ట పరిహారానికి సరైన పారితోషికం ప్రభుత్వం నుండి అందే విధంగా మంత్రిగా దృష్టికి తీసుకెళ్తామని రైతుకు ధైర్యం చెప్పారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు నర్స గౌడ్, యశ్వంతరావుపేట గ్రామ ఉపసర్పంచ్ కోల శ్రీనివాసు, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పెద్దనవేణి శంకర్, కాంగ్రెస్ నాయకులు సమిత్, కోల గంగన్న, పొన్నం రాహుల్ , బక్కన్న కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

# శిశువుల ఆరోగ్యానికి మొదటి 1000 రోజులు కీలకం

ఏసీడీపీవో రాజశ్రీ

జగిత్యాల, రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ తక్కల్లపల్లి గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీడీపీవో బి. రాజశ్రీ మాట్లాడుతూ, గర్భిణీ దశ నుండి శిశువుకు మూడు సంవత్సరాల వయస్సు వచ్చే వరకు ఉండే మొదటి 1000 రోజులు అత్యంత కీలకమైనవని స్పష్టం చేశారు. ఈ కాలంలోనే పిల్లలకు పౌష్టికాహారం, సరైన సంరక్షణ అందించడం ద్వారా వారి శారీరక, మానసిక ఎదుగుదల మెరుగ్గా ఉంటుందని ఆమె తెలిపారు. పిల్లల పెంపకంలో పోషణ, ఆరోగ్యం, ప్రారంభ అభ్యాసనం, బాధ్యతాయుతమైన సంరక్షణ, భద్రత, సంరక్షకుల శ్రేయస్సు అనే ఆరు అంశాలు ప్రధాన మూలస్తంభాలని ఆమె వివరించారు. ముఖ్యంగా తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, శిశువుకు తల్లిపాలు అందించడం, సరైన సమయంలో అనుబంధ ఆహారం ప్రారంభించడం వంటి విషయాలపై అవగాహన కల్పించారు. శిశువు మెదడు అభివృద్ధిలో తల్లిదండ్రులు తమ పిల్లలతో క్రమంగా సంభాషించడం ఎంతటి ప్రభావం చూపుతుందో వివ రించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగమణి, జోష్న, ఏఎన్ఎం శోభ, ఆశ లత, గ్రామస్తులు, తల్లులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పంట అవశేషాలు కాల్చితే జరిమానాలు విధిస్తాం

చొప్పదండి, ప్రభాతవార్త:



రైతు సదస్సుల్లో భాగంగా శుక్రవారం చాకుంట , చొప్పదండి, గుమ్లాపూర్, కాట్నపల్లి, రాగంపేట గ్రామంలో పంట అవశేషాలు కాల్చకూడదని ఒక వేల కాల్చితే జరిమానాలు విధించడం జరుగుతుందని హెచ్చరించారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశము నిర్వహించారు. సమావేశంలో భాగంగా రైతులకు వ్యవసాయ విస్తరణ అధికారులు పలు సూచనలు చేయడం జరిగినది. రైతులు వరి కొయ్య కాలు, పంట అవశేషాలు కాల్చకుండా భూమిలోనే మురగపెట్టి కలియదున్నాలని తెలిపారు. ఒకవేళ కాల్చితే నేల కాలుష్యం, పర్యావరణ కాలుష్యము, నేల సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుంది. నేలలోని మిత్ర జీవులు వానపాములు చనిపోవటం వలన నేల గుల్లబారటం తగ్గుతుంది అని వివరించారు. ఒకవేళ పంట అవశేషాలు కాల్చితే జరిమానా విధిస్తారు అని తెలిపారు. సేంద్రీయ వ్యవసాయము వైపు రైతులు అడుగులు వేయాలని అవగాహన చేయటం జరిగినది. వానాకాలం సమాయత్తం గురించి విత్తనాలు లైసెన్స్ డీలర్ వద్ద కొనుగోలు చేసి రసీదు పొందాలని తెలిపారు. వరి సన్నరకాల గూర్చి వివరించారు. పంట వైవిధ్యకరణలో ఆయిల్ పామ్ పంట సాగు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో భాగంగా వ్యవసాయ విస్తరణ అధికారులు సంపత్, రమ్యజ్యోత్స్న, సాయి ప్రసన్న, కవిత, రాజశేఖర్ తో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వేసవి తాపం తీవ్రం.... మజ్జిగ పంపిణీ

చొప్పదండి,ప్రభాతవార్త:.




వేసవి తాపం తీవ్రంగా ఉండడంతో ప్రయాణికులు, ప్రజలు రోడ్లపై తీవ్ర దాహంతో తల్లడిల్లుతున్న నేపథ్యంలో శుక్రవారం చొప్పదండి పట్టణంలోని రాష్ట్ర రహదారిపై అయ్యప్ప కిరాణం వద్ద లయన్స్ క్లబ్, అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో దాత మహేషుని మల్లేశం అందించిన మజ్జిగ ను పంపిణీ చేశారు. ఇప్పటికే లయన్స్ క్లబ్ సేవా సమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపట్టిన ఈ అన్నపూర్ణ సేవా సమితి ప్రతి శుక్రవారం అన్న దానం తో పాటు అల్పాహార కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మహేషుని మల్లేశం, తాటిపల్లి అంజయ్య, సిరిపురం రాజు, జగదీష్, మహేష్, లక్ష్మణ్, శ్రీనివాస్, నాగరాజు తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మానాల గ్రామానికి త్రుటిలో తప్పిన భారీ అగ్నిప్రమాదం

మల్యాల /ప్రభాతవార్త



మల్యాల మండలంలోని మానాల గ్రామానికి శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం తప్పింది, గ్రామ పోలిమేరలలో గడ్డి మంటలు చెలరేగి పంట పొలాల నుండి గ్రామ శివారు వరకు వ్యాపించడానికి గమనించిన స్థానికులు గ్రామ సర్పంచ్ బల్మూరి పాపారావుకు తెలియజేయడంతో ఆయన వెంటనే జగిత్యాల ఫైర్ ఇంజన్ అధికారులకు సమాచారం ఇచ్చారు, దీంతో హుటాహుటిన ఫైర్ ఇంజన్ ప్రమాదస్థలికి చేరుకొని స్థానికులతో కలిసి సర్పంచ్ తో పాటు పంచాయతీ కార్యదర్శి మధు జిపిఓ లక్ష్మణ్ ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు, ఒకవైపు భానుడి భగభగ మండే ఎండల్లో మంటలు ఆర్పేందుకు స్థానికులు ఎక్కడికక్కడే వ్యవసాయ భావి మోటార్లను ఆన్ చేసి పొలాల్లో నీటిని వదిలే ప్రయత్నం చేశారు, మరోవైపు ఫైర్ ఇంజన్ సిబ్బంది కూడా దట్టమైన గడ్డి పొదలకు అంటుకున్న మంటలను ఆర్పేందుకు కష్టపడ్డారు, ఈ మంటలు క్రమంగా గ్రామంలోకి ప్రవేశించే ప్రమాదం ఏర్పడినందున ముందుగానే మంటలను అదుపులోకి తీసుకురావడంతో మానాల గ్రామానికి భారీ ముప్పు తప్పింది, అన్ని ప్రమాదం ఎలా సంభవించింది కారణం తెలియనప్పటికీ సకాలంలో స్పందించడం వల్ల పెను ప్రమాదం నుండి బయటపడినట్లు సర్పంచ్ పాపారావు తెలిపారు,

## బాల్యారంభ ప్రాముఖ్యత పై అవగాహన

మల్యాల /ప్రభాతవార్త

మల్యాల మేజర్ గ్రామపంచాయతీలో శుక్రవారం మహిళా వారోత్సవ కార్యక్రమంలో భాగంగా మాత శిశు సంరక్షణ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ దశ నుండి రెండు సంవత్సరాల కాలాన్ని1000 రోజుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు, గర్భిణీ దశలో తీసుకోవాల్సిన పోషకాహారాలు, బిడ్డ పుట్టిన తర్వాత ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని ఏడవ నెల నుండి అనుబంధ పోషకాహారం అందించాలని వివరించారు, పిల్లల ఎదుగుదల ఆరోగ్య స్థితి అవగాహన కు ఎప్పటికప్పుడు ఎత్తు బరువులు పరిశీలన జరపాలన్నారు, కార్యక్రమంలో సిడిపిఓ వీరలక్ష్మి ్మ , సర్పంచ్, కార్యదర్శి,అంగన్వాడి సూపర్వైజర్లు శారద, పవిత్ర పట్టణానికి చెందిన అంగన్వాడి టీచర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు

## త్రివేణి సంగమంలో భక్తుల జనసంద్రం

**ముగింపునకు చేరువలో అంత్య పుష్కరాలు**

**తొమ్మిదవ రోజు సరస్వతి ఘాట్‌కు పోటెత్తిన ఆరు రాష్ట్రాల భక్తులు**

మహాదేవపూర్, మే 29, ప్రభాతవార్త



త్రివేణి సంగమ తీరం భక్తుల రాకతో పూర్తిగా జనసంద్రంగా మారింది. పవిత్ర అంత్య పుష్కరాల వేడుకలు తొమ్మిదవ రోజుకు చేరుకోవడంతో పుణ్యస్నా నాలు ఆచరించేందుకు భక్తులు భారీగా తరలివస్తున్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుండి, ముఖ్యంగా ఆరు రాష్ట్రాల నుండి తరలివచ్చిన లక్షలాది మంది భక్తులతో ఎ ్ ా ట్ల నీ ్న కిక్కిరిసిపోయాయి. పుష్కరాల్లో అత్యంత పవిత్రమైనదిగా భావించే సరస్వతి ఘాట్ వద్ద భక్తుల రద్దీ పీఠభూమికి చేరింది. తెల్లవారుజాము నుంచే భక్తులు నదీ తీరానికి చేరుకుని సాంప్రదాయబద్ధంగా పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. పితృదేవతలకు పిండప్రదానాలు, తర్పణాలు వదిలేందుకు భక్తులు వరుస కట్టారు. గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమ క్షేత్రం ఆధ్యాత్మిక మంత్రోచ్చారణలతో మార్మోగుతోంది. నదీ స్నానాలు పూర్తి చేసుకున్న భక్తులు సమీపంలోని ప్రధాన ఆలయ దర్శనానికి పోటెత్తుతున్నారు. దీంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉచిత దర్శనం, ప్రత్యేక దర్శనం లైన్లలో భక్తులు గంటల తరబడి వేచి ఉండి స్వామివారిని దర్శించుకుంటున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తాగునీరు, నీడ కొరత లేకుండా చర్యలు చేపట్టారు. అంత్య పుష్కరాలు ముగింపు దశకు వస్తుండటంతో రాబోయే మూడు రోజుల్లో భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

## జూన్ 2న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

**భద్రకాళి అమ్మవారికి ముడుపు**

**కట్టిన కండక్టర్ ఐక్యవేదిక నాయకులు**

మే 29, ప్రభాతవార్త, హనుమకొండ టౌన్ :



ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్ డే ప్రకటించాలని కోరుతూ కండక్టర్ ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు శుక్రవారం భద్రకాళి అమ్మవారికి ముడుపు కట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం జూన్ 2న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు రంజిత్ యాదవ్, యుగంధర్, ఆనంద్ రెడ్డి, ప్రభావతి, రజిత, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న అఘోరీ

మహాదేవపూర్, మే 29, ప్రభాతవార్త



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని ప్రసిద్ధ ఇంద్రాణి కాళీ కాలభైరవ శక్తిపీఠ నిర్వాహకులు, కాలభైరవ ఉపాసకులు అయిన రామకృష్ణ అఘోరి శుక్రవారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆలయానికి చేరుకోగానే అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం రామకృష్ణ అఘోరి స్వామివారి సన్నిధిలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. కాలభైరవ ఉపాసనలో భాగంగా లోకకల్యాణార్థం, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకుంటూ ఆయన ఈ ప్రత్యేక పూజలు చేసినట్లు భక్తులు తెలిపారు. అఘోరీ రామకృష్ణ కాళేశ్వరం రావడంతో ఆలయ పరిసరాల్లో భక్తుల కోలాహలం నెలకొంది. ఆయనను దర్శించుకునేందుకు, ఆశీస్సులు తీసుకునేందుకు స్థానిక భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అధికారులు ఆయనకు తీర్థప్రసాదాలు అందించి, శేషవస్త్రంతో సత్కరించారు.

## కాళేశ్వర పుష్కరాలలో శ్వేతా ప్రసాద్ భక్తి సంగీత లహరి..!

**ఆధ్యాత్మిక భావనతో పరవశించిన పుష్కర ప్రాంగణం...**

**పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక వైభవం....**

**గాత్ర మాధుర్యంతో భక్తులను అలరించిన శ్వేతా ప్రసాద్ బృందం**

మహాదేవపూర్, మే 29, ప్రభాతవార్త



కాళేశ్వరం సరస్వతి అంత్య పుష్కరాలలో భక్తి సంగీత లహరి బృందం చే నిర్వహించబడింది కాళేశ్వరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరుగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలు సందర్భంగా, తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ సహకారంతో పరంపర ఫౌండేషన్ నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ నేపథ్య గాయని శ్రీమతి శ్వేతా ప్రసాద్ తన సంగీత విభావరితో భక్తులను అలరించారు. ఆల్ ఇండియా రేడియో టాప్ గ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు పొందిన శ్రీమతి శ్వేతా ప్రసాద్, సంగీత నాటక్ అకాడమీ పురస్కార గ్రహీతగా విశిష్ట సేవలు అందించారు. ఆమె ఇప్పటివరకు రెండు వేలకుపైగా భక్తి, జానపద, సినీ మరియు లలిత గీతాలను ఆలపించి సంగీత రంగంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ప్రముఖ సినీ నటుడు రక్తకన్నీరు నాగభూషణం గారి మనుమరాలు గా కూడా ఆమెకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ సందర్భంగా ఆమె భక్తి గీతాలు, ఆధ్యాత్మిక కీర్తనలు, లలిత సంగీత గానాలతో పుష్కరాల ప్రాంగణాన్ని భక్తిమయంగా మార్చారు. ఆమె గాత్ర మాధుర్యం, భావవ్యక్తీకరణ, సంగీత నైపుణ్యం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్వర సహకారంగా కుమారి చిన్మయి, కుమారి హరి ప్రియ, కుమారి ప్రసిద్ధ, శ్రీ కౌశిక్ పాల్గొన్నారు. వాద్య సహకారంగా కీబోర్డ్‌పై శ్రీ సంతోష్, తబలాపై శ్రీ మోహన్, మృదంగంపై శ్రీ రేణుక ప్రసాద్, రిథమ్ ప్యాడ్‌పై శ్రీ వాచస్పతి తమ ప్రతిభను ప్రదర్శించారు. సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తి, సంగీతం, సంస్కృతిని సమన్వయం చేస్తూ భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తున్నాయి.

## మే 31న సిద్దార్థ స్మారక పురస్కారాలు

**జగిత్యాల టౌన్ ప్రభాత వార్త..**



ప్రముఖ రంగస్థల నటులు, దర్శకులు సిధార్థ 14 వ స్మారక స్రవంతి అవార్డ్స్,పురస్కారాలు :రాష్ట్ర తెలుగు నాటక రంగంలో నటులుగా, దర్శకులుగా, రచయితగా, జర్నలిస్టుగా, వైద్య శాఖ అధికారిగా, చల్లూరు, మెట్టుపల్లి, కరీంనగర్ కేంద్రంగా మూడు దశాబ్దాలకు పైగా వివిధ నాటక సంస్థలను స్థాపించి, నిర్వహించిన, తెలుగు నాటక రంగానికి అద్వితీయ సేవ్నలదించిన స్వర్గీయ సిధార్థ అలియాస్ గరువందుల నారాయణ 14 వ స్మారక స్రవంతి అవార్డులు, పురస్కారాలను ఈ నెల ( మే )31 న జగిత్యాల శ్రీ విశ్వ గాయత్రి పరివార్ జ్ఞాన మందిరంలో ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు శాతవాహన కళా స్రవంతి( 1984 స్థాపితము) కరీంనగర్, అభినయ కళా నికేతన్ జగిత్యాల సంస్థల అధ్యక్షులు వై యస్ శర్మ, కొమురవెల్లి లక్ష్మి ్మనారాయణలు తెలిపారు. విద్య, వైద్యం, పత్రిక, నాటక, రచన రంగాలలో ప్రముఖులకు ఈ అవార్డ్స్, పురస్కారాలు ప్రదానం చేయనున్నట్టు శాతవాహన, అభినయ కళా సంస్థలు తెలిపాయి. స్వర్గీయ సిధార్థ తో అనుబంధం వున్న బంధు, మిత్రులు, కళాకారులు, జర్నలిస్టు, వైద్య ఉద్యుగులు, రచయితలను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

## నిర్వాహకుల నిరక్ష్యం అన్న దాతలకు శాపం

**ఇల్లంతకుంట, ప్రభాతవార్త**



మండలములోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆడిందే ఆటగా తయారైంది.అన్నదాతల కష్టం నిర్వాహకులకు ఏ మాత్రం పట్టింపు లేదు. వరి కోత మొదలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోయడం, అమ్ముకోవడం, మిల్లులకు తరలించడం ఒక సవాలుగా మారింది.అయితే రైతుల కష్టం నిర్వాహకులు ఒక్కరే కాదు మండల స్థాయి అధికారులు కూడా గుర్తించడం లేదనే విమర్శలు రైతుల నుండి వస్తున్నాయి. నిర్వాహకులు ధాన్యం తూకం మొదలు పెట్టి దాదాపు నెల గడిచిన ఇంకా ఆయా గ్రామాల్లో 5 నుండి 10 లారీల ధాన్యం కేంద్రాల్లోనే ఉండి పోయింది.దీనికి తోడు వర్షాలు రైతన్నకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి.నిర్వాహకులు వారి అను యాయులకు సంబందించిన ధాన్యాన్ని తూకం వేయడం,ముందుగా కోసిన రైతు ధాన్యాన్ని తర్వాత తూకం వేయడం జరిగిన అధికారులు పట్టించుకోవడం లేదు.మండలములోని రహీం ఖాన్ పేట గ్రామములో ఇదే తంతు జరగడముతో శుక్రవారం రైతులు నిర్వాహకులపై కోపోద్రిక్తులయ్యారు. అంతే కాకుండా గ్రామాన్ని వదిలి పక్కగ్రామ రైతు ధాన్యం తూకం వేయించారనే ఆరోపణలు రావడముతో స్థానిక తహసీల్దార్ సురేష్ గ్రామానికి వెళ్లి సక్రమంగా జరపాలని నిర్వాహకులను ఆదేశించారు.ఇక తూకం విషయానికోస్తే ఒక్కో కేంద్రములో ఒక్కో విధంగా కొనసాగిన అధికారులు మాత్రం మిన్నకుంటున్నారు.కొన్ని గ్రామాల్లో 42.500 కిలోలు మరికొన్ని గ్రామాల్లో 42.700 కిలోలు తూకం వేయించిన మిల్లు యజమానులు క్వింటాళ్లకు క్వింటాలు తరుగు పేరిట కోత విధిస్తున్నారు.దీనిపై మిల్లు యజమానూలు, నిర్వాహకులు కుమ్మక్కు అయ్యారనే ఆరోపణలు రైతుల నుండి వినబడుతున్న మాటలు.ఏదీ ఏమైనా అన్నం పెట్టె రైతుకు అందరూ కుమ్మక్కు అయ్యి సున్నం పెడుతున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు రైతులకు జరుగుతున్న నష్టాన్ని నివారించాలని కోరారు.

## కాచనపల్లి అమరవీరులకు నివాళులు

**గార్ల,మే29,ప్రభాతవార్త:**

కాచనపల్లి అమరవీరుల 35వ వర్ధంతి సందర్భంగా మండలంలోని మద్దివంచ గ్రామంలో సిపిఐ(ఎం.ఎల్)న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య మాట్లాడుతూ గోదావరి లోయ పరివాహక ప్రాంతంలో వారు చేసిన త్యాగాల ద్వారా లక్షలాది ఎకరాల భూమిని కష్టజీవులకు సాదించిపెట్టారన్నారు. అమరవీరుల ఆశయ సాధన కొరకు కదం తొక్కుదామని కష్టజీవుల రాజ్యం కొరకు ఐక్యంగా పోరాడుదామన్నారు. గోదావరి లోయ ప్రతిఘటన పోరాటంలో వందలాదిమంది తమ అమూల్యమైన ప్రాణాలు అర్పించి కష్టజీవుల రాజ్యంకై యుద్ధాన్ని నేర్పిన అమరవీరులకు విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో కె.బాబురావు, మల్లేశం, శ్రీరాములు, వెంకన్న, చల్ల మల్లేశం, రోశయ్య, రాంబాబు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి**

**జగిత్యాల, బ్యూరో ప్రభాత వార్త:**



స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్.) కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్ పై శిక్షణా కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షి ంచారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్.లత పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 సార్లు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో 2002 లో ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్/ డూప్లికేట్ ఎంట్రీల తొలగింపు జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు.జూన్ 25 నుండి జూలై 24 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హత ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాలు క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.ఒక కుటుంబ సభ్యులందరూ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో ఉండేలా చూడాలని, 1200 మంది ఓటర్ల సంఖ్య దాటితే కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి బీ.ఎల్.వో వద్ద ఎన్యుమరేటర్ ఫారాలు తగినంతగా అందుబాటులో ఉండేలా చూడాలని, ఎన్యుమరేషన్ సమయంలో ఎలాంటి ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదని తెలిపారు.ప్రతి బీ.ఎల్.వో.కు ఎస్.ఐ.ఆర్ నిబంధనలు, విధి విధానాలు, ఫీల్డ్ వెరిఫికేషన్ విధానం, ఫారాల నిర్వహణపై పూర్తి అవగాహన, పట్టు ఉండేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శిక్షణ కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

## సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

**గూడూరు, మే 29, ప్రభాతవార్త**

రైతుల నుండి నేరుగా ధాన్యం, మక్కలు కొన్న ప్రభుత్వం అంతే వేగంతో రైతులకు డబ్బులు వారి ఖాతాల్లో జమచేస్తున్నందుకు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ఈమేరకు పార్టీ జిల్లా నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్ ఆధ్వర్యంలో సిఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసారు. ఈమేరకు మండలంలోని బ్రాహ్మణపల్లి, ఏపూరు గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సతీష్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, సిఎం రేవంత్‌రెడ్డి రైతు సంక్షేమం కొరకు కట్టుబడి పనిచేస్తున్నారన్నారు. రైతు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్దంగా ఉందని, కొనుగోళ్లకు సంబంధించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారన్నారు. దీనిని జీర్ణించుకోలేని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని, వారి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ కూడా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజా సమస్యలపై స్పందిస్తున్న తీరు పట్ల కూడా హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూనెం యాకయ్య, రామన్న, మధు, శ్రీనివాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణి

**గూడూరు, మే 29, ప్రభాతవార్త**

మండలంలోని రాములుతండాకు చెందిన తేజావత్ నరేష్‌కు మంజూరైన సిఎం సహాయనిధి ఆర్థిక సహాయ చెక్కును మాజీ ఎంపిపి నూనావత్ రమేష్‌నాయక్ శుక్రవారం ఆయనకు అందజేసారు. మహబూబాబాద్ ఎంపి బలరాంనాయక్ సహకారంతో సిఎం సహాయనిధి నుండి నరేష్‌కు రూ. 48.50 వేల ఆర్థికసహాయం మంజూరు చేయించడం జరిగిందని రమేష్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు హెచ్ శివకృష్ణ, రాములుతండా వాసులు పాల్గొన్నారు.

## ఆర్జీ1లో కార్మిక సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**సీఎండీకి ఏఐటీయూసీ వినతిపత్రం**

**గోదావరిఖని ,ప్రభాతవార్త:**




సింగరేణి ఆర్జీ1 ఏరియాలో కార్మికులు ఎదుర్కొంటున్న తాగునీరు, వైద్య సేవలు, గనుల్లో మెటీరియల్ కొరత వంటి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాశ్‌ను కోరారు. శుక్రవారం జీడీకే11 ఇంక్లైన్ సందర్శనకు వచ్చిన సీఎండీకి ఏఐటీయూసీ అర్జీ1 బ్రాంచి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను మాట్లాడుతూ, ఆర్జీ1లో రూ.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న గ్రావిటీ వాటర్ ఫిల్టర్ బెడ్ పనులను త్వరగా పూర్తి చేసి కార్మికులకు శుద్ధి చేసిన తాగునీరు అందించాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఏరియా ఆసుపత్రిలోని క్యాథ్‌ల్యాబ్‌కు "సింగరేణి క్యాథ్‌ల్యాబ్"గా పేరు మార్చాలని, మెడికల్ బోర్డు సమావేశాలను వెంటనే నిర్వహించాలని కోరినట్లు చెప్పారు.పెండింగ్‌లో ఉన్న మారుపేర్లు, విజిలెన్స్ కేసులకు సంబంధించిన కార్మికుల డిపెండెంట్లకు ఉద్యోగాలు కల్పించాలని, గనుల్లో పాత యంత్రాల స్థానంలో కొత్త యంత్రాలు ఏర్పాటు చేసి ఉత్పత్తి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఓసీపీ5కు కొత్త డంపర్లు, షావెల్స్, లోడర్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు.సీఎస్ఆర్ నిధులను ప్రభుత్వ పథకాల కోసం కాకుండా కార్మిక కాలనీలు, ప్రభావిత గ్రామాల అభివృద్ధికి వినియోగించాలని, ఏరియా ఆసుపత్రిలో పూర్తిస్థాయి వైద్యులను నియమించి అవసరమైన వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అండర్‌గ్రౌండ్ గనుల్లో డ్రిల్ బిట్లు, డ్రిల్ రాడ్లు, హ్యాండ్ గ్లౌజులు, నట్‌బోల్ట్స్ తదితర మెటీరియల్ సరఫరాను మెరుగుపరచాలని కోరారు. అన్ని గనులు, విభాగాల్లో కార్మికుల సౌకర్యార్థం కఫ్‌బోర్డులు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ముందుగా సీఎండీకి పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్‌తో పాటు మాదన మహేష్, ఎస్. వెంకట్‌రెడ్డి, సిద్దమల్ల రాజు, పి. విజయలక్ష్మి ్మ, సిర్ర మల్లికార్జున్, నాయిని శంకర్, గొడిశల నరేశ్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## క్షుణ్ణంగా ప్రతి ఓటరు వివరాలను పరిశీలించాలి

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**

**పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:**

ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఓటరు వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం, మ్యాపింగ్ పురోగతిని సమీక్షి ంచారు. లిజిల్లా సమీకృత కలెక్టరేట్‌లో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ 1950 నుంచి ఇప్పటి వరకు దాదాపు 10 సార్లు ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో గతంలో 2002లో ఎసఐఆర్ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎసఐఆర్ కార్యక్రమం ద్వారా శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాల తొలగింపు, డబుల్ ఎంట్రీల తొలగింపు జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించనున్నట్లు చెప్పారు. జూన్ 24 నుండి జూలై 25 వరకు బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను పూర్తిస్థాయిలో ధృవీకరించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, ప్రతి అర్హ ఓటరిని గుర్తించి జాబితాలో చేర్చాలని తెలిపారు. డ్రాఫ్ట్ ఓటరు జాబితా సిద్ధం చేసే ముందు ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా వీఐపీ, వీవీఐపీ ఓటర్ల పేర్ల మ్యాపింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

